నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

బంతిభోజనం-బల్లభోజనం
బంతిభోజనమున బతిమాలి పెట్టగా
కడుపునిండ తింటి కమ్మగాను
బల్లభోజనమున బారెడు వరుసలో
సగము కడుపు నిండె సత్యముగను

మీ
విజయ్రప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 177 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 6 -10 -2025 పేజీలు -8 | వెల: రూ. 5.00



## నవంబర్ 22లోగా బీహార్ ఎన్నికలు

- బ్యాలెట్‌లో అభ్యర్థుల కలర్ ఫొటోలు
- సిఇసి జ్ఞానేశ్ కుమార్

న్యూఢిల్లీ

నవంబర్ 22 లోగా బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేస్తామని కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ఇసిఐ పూర్తి సన్నద్ధంగా ఉందని చెప్పారు. ఇవిఎంల్లో పొందుపరిచే బ్యాలెట్ పేపర్లలో అభ్యర్థుల కలర్ ఫొటోలను పెట్టనున్నామని, కలర్ ఫొటోలు పెట్టడం ఇదే తొలిసారి అని చెప్పారు. రాష్ట్రంలో రెండు రోజుల పర్యటనలో భాగంగా శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించగా.. ఆదివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో ఎన్నికల కమిషన్ సమావేశమైంది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోకమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సింధు, వివేక్ జోషిలతో కలిసి జ్ఞానేష్ కుమార్ మాట్లాడారు. పుట్టిన తేదీ, పౌరసత్వానికి ఆధార్ ధ్రువీకరణ కాదని మరోసారి స్పష్టం చేశారు. చట్టానికి లోబడే ఆధార్‌ను ఉపయోగిస్తున్నామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని, గరిష్ఠంగా 1,200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఉంటుందని చెప్పారు. ఇప్పటికే బూత్ స్థాయి -మిగతా 2 లో

# ఆగేనా.. సాగేనా?



## స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ఉత్కంఠ

### నేడు సుప్రీం కోర్టు తీర్పు.. ఎల్లుండి హైకోర్టులో విచారణ




- కోర్టులు అడ్డు చెబితే రిజర్వేషన్లు మారే అవకాశం
- ఇప్పటికే 42శాతం బీసీ రిజర్వేషన్లతో స్థానాలు ఖరారు
- కొందరికి సంతృప్తి.. చాలా చోట్ల సీనియర్ నేతల అసంతృప్తి
- సుప్రీం, హైకోర్టు నిర్ణయాలపై ఆశావహుల ఎదురుచూపు

హైదరాబాద్, అక్టోబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):

స్థానిక సంస్థల ఎన్నికలపై ఉత్కంఠ నెలకొంది. ఒకవైపు ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటికీ ఎన్నికలు జరుగుతాయా..? కోర్టు జోక్యంతో వాయిదా పడుతాయా..? రిజర్వేషన్లు మారుతాయా..? అనే ఉత్కంఠ నేతల్లో నెలకొంది. బీసీలకు ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇచ్చిన జీవోను సవాల్ చేస్తూ పలువురు సుప్రీంకోర్టు, హైకోర్టులను ఆశ్రయించటంతో ఎన్నికలపై అనిశ్చితి కొనసాగుతోంది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలో అన్ని స్థానిక సంస్థలకు రిజర్వేషన్లు ఖరారు చేసి, ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. అయితే 42శాతం రిజర్వేషన్లపై అభ్యంతరం వ్యక్తం చేస్తే.. ప్రస్తుత రిజర్వేషన్లు తారుమారయ్యే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. బీసీ సీట్లు తగ్గటంతో పాటు జనరల్ సీట్లు మరిన్ని పెరిగే అవకాశం ఉంది. రిజర్వేషన్లు కలిసి రాక అసంతృప్తితో ఉన్న ఆశావహులు.. కోర్టు తీర్పుపై ఆశగా ఎదురుచూస్తున్నారు. -మిగతా 2లో



## యుద్ధ విమానాల కింద సమాధి చేస్తాం

- భారత్‌పై పాక్ రక్షణ మంత్రి ప్రేలాపన

న్యూఢిల్లీ,


ఉగ్రవాదాన్ని పెంచి పోషించే చర్యలను నిలిపివేయకపోతే పాకిస్థాన్‌ను ప్రపంచ పటం నుంచి తుడిచిపెడతామని భారత ఆర్మీ చీఫ్ చేసిన హెచ్చరికపై పాకిస్థాన్ స్పందించింది. భవిష్యత్తులో తమపై సైనిక దాడులకు పాల్పడితే భారతదేశానికి చెందిన యుద్ధ విమానాల శకలాల కిందనే ఆ దేశాన్ని భూ స్థాపితం చేస్తామని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ ఆదివారం హెచ్చరించారు. భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ పాకిస్థాన్ తన ఉగ్రవాద ప్రాయోజిత చర్యలను నిలిపివేయాలని ఇటీవల హెచ్చరికలు జారీ చేశారు.దీనిపై ఆసిఫ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ ఈ హెచ్చరికలను భారతదేశ అత్యున్నత భద్రతా వ్యవస్థ నుంచి వచ్చిన కవ్వింపు ప్రకటనలుగా అభివర్ణించారు. ఈ ఏడాది మేలో జరిగిన ఘర్షణలలో ఓటమి పాలైన భారత్ పోయిన తన పరువును పునరుద్ధరించుకునేందుకు -మిగతా 2 లో

## మా అభ్యంతరాలను గౌరవించాలి

### అమెరికాతో వాణిజ్య చర్చలపై జైశంకం

న్యూఢిల్లీ, అక్టోబర్ 5

అమెరికాతో వాణిజ్య వివాదాలను పరిష్కరించుకోవడానికి భారత్ కృషి చేస్తోందని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తెలిపారు. ఈ చర్చలలో భారత్ వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను అమెరికా గౌరవించాలని ఆయన స్పష్టం చేశారు. అనేక అంశాలపై ఏకాభిప్రాయానికి రాలేకపోవడమే భారతీయ ఎగుమతులపై అమెరికా సుంకాల విధింపునకు దారి తీసిందని ఆయన చెప్పారు.ఆదివారం -మిగతా 2లో





## 'స్వశక్తి' చీరలతో భరోసా..

- జిల్లా నేతన్నలకు 4.30 కోట్ల మీటర్ల వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లు
- 9600పైగా మరమగ్గాల ద్వారా 3.17 కోట్ల మీటర్లు ఉత్పత్తి
- నాణ్యతలో తేడా రాకుండా చర్యలు
- నేడు పరిశీలించనున్న మంత్రి సీతక్క

(సిరిసిల్ల)అక్టోబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):

సిరిసిల్ల నేతన్నలకు ప్రభుత్వం అందిస్తున్న వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లు ఉపాధి భరోసానిస్తున్నాయి. కాలంతో పోటీ పడలేక మరమగ్గాల మధ్యనే బతుకులు వెళ్లదీస్తున్నారు. నిత్యం ఆకలి చావులు, ఆత్మహత్యలు చవిచూసిన సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు గత ప్రభుత్వంలో బతుకమ్మ చీరలు.. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో స్వశక్తి చీరల ఆర్డర్లు నేతన్నలకు బతుకు భరోసా కల్పించాయి. ఇందిరా మహిళా శక్తి పథకంలో తెలంగాణ ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళలకు ప్రతి సంవత్సరం రెండు చీరలు అందించే విధంగా నిర్ణయించారు. ఆ మేరకు నేతన్నలకు చేతినిండా పని కలిగే విధంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు చీరల ఉత్పత్తి ఆర్డర్లను ఇచ్చారు. బతుకమ్మ పండుగకు స్వశక్తి మహిళలకు చీరలు అందించే దిశగా ఏర్పాట్లు చేసినా పూర్తిస్థాయిలో చీరలు ఉత్పత్తి కాకపోవడంతో వాయిదా పడినట్లు సమాచారం.

-మిగతా 2లో

## కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లారా జాగ్రత్త

### పోలీసులు, అధికారులు జాగ్రత్తగా ఉండాలి



- ఎవరెవరు అధికారులు పోలీసోళ్లు ఇబ్బంది పెట్టిర్రో వాళ్ళందరి సంగతి చెబుతాం
- పోయిన పదేళ్లు ఊకున్నాం..ఈసారి అట్లుండదు
- హరీశ్‌రావు వార్నింగ్

హైదరాబాద్, అక్టోబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):

ఎవరెవరు అధికారులు పోలీసోళ్లు ఇబ్బంది పెట్టిర్రో వాళ్ళందరి సంగతి చెబుతామని హరీశ్‌రావు హెచ్చరించారు. పోలీసులు, అధికారులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పోయిన పదేళ్లు ఊకున్నాం.. ఈసారి అట్లుండదని అన్నారు.ఈసారి అభివృద్ధి చేస్తాం.. ఎక్స్‌ట్రాలు చేసిన అధికారులకు వడ్డీతో సహా చెల్లిస్తామని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన వాళ్లను అరెస్టు చేస్తున్నారని.. కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లారా జాగ్రత్త అని వార్నింగ్ ఇచ్చారు.ఎల్లారెడ్డి నియోజకవర్గం గాంధారి మండలంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు సమక్షంలో బీజేపీ నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు, నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ..రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత పన్నులేసుడు తప్ప కొత్తవి ఇచ్చిందేమీ లేదని హరీశ్‌రావు అన్నారు. మళ్లీ భూముల ధరలు -మిగతా 2లో



## రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ వర్తింపజేయాలి

- డిప్యూటీ సీఎం భట్టికి వయోధిక పాత్రికేయ సంఘం వినతి

హైదరాబాద్,

కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ వర్తింపజేయాలని వయోధిక పాత్రికేయ సంఘం విజ్ఞప్తిచేసింది. ఈ మేరకు ఆదివారం సంఘం నేతలు కేశవరావు, లక్ష్మణ్‌రావు, ఎన్ శ్రీనివాస్‌రెడ్డి, బండారు శ్రీనివాసరావు, సీ కేశవులు, ఫాజిల్, వేణుగోపాల్‌తో కూడిన బృందం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ప్రజాభవన్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు

## దగ్గు మందు తయారీపై బీ కేర్‌ఫుల్

- రాష్ట్రాలతో అత్యవసర సమావేశంలో కేంద్రం
- కోల్డ్రిఫ్ దగ్గు మందులో డీఈజీ పరిమితి కన్నా అధికం
- చిన్నారులకు దగ్గు మందు వాడాల్సిన అవసరం లేదు
- నిబంధనలు పాటించని కంపెనీల లైసెన్సులు రద్దు




న్యూఢిల్లీ, అక్టోబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):

దగ్గు మందు తయారీపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని కేంద్ర ఆరోగ్య శాఖ అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. ఆ శాఖ ఆదివారం అత్యవసరంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆరోగ్య శాఖల కార్యదర్శులు, డ్రగ్ కంట్రోల్ అధికారులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో కోల్డ్రిఫ్ దగ్గు మందును వాడటం వల్ల కనీసం 14 మంది చిన్నారులు మరణించిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. భవిష్యత్తులో ఇటువంటి విషాదకర

-మిగతా 2లో

# నవంబర్ 22లోగా బీహార్ ఎన్నికలు

(మొదటి తరువాయి)

అధికారులకు శిక్షణ పూర్తి చేశామని, ఎన్ని దశల్లో పోలింగ్ నిర్వహించాలనే దానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. బ్యాలెట్ పేపర్లలో అభ్యర్థుల కలర్ ఫొటోలను ఉంచడం తద్వారా అభ్యర్థులను ఓటర్లు తేలికగా గుర్తుపట్టేందుకు వీలుంటుందని తెలిపారు. సీరియల్ నంబర్ కూడా పెద్దగా కనిపించేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. తదుపరి ఎన్నికల నుంచి దేశవ్యాప్తంగా సీరియల్ నెంబర్ ఫాంట్లు పెద్దవిగా ఉండేలా, అభ్యర్థుల ఫొటోలు కలర్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బీహార్‌లో 22 ఏళ్ల తరువాత స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) చేపట్టామని చెప్పారు. 243 నియోజకవర్గాల్లో ఒక్కోదానికి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈవోఆర్) ఉన్నారని, ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి వారికి 90,207 మంది బూత్ లెవల్ ఆఫీసర్లు (బిఎల్‌వో) సహాయం చేశరాని తెలిపారు. ఎస్ఐఆర్‌తో అనర్హులను జాబితా నుంచి తొలగించామని, దీన్ని బీహార్ ఓటర్లు కూడా స్వాగతించారని పేర్కొన్నారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలుంటే తెలిపేందుకు రాజకీయ పార్టీలకు ఇంకా అవకాశం ఉందన్నారు. ఛాత్ పండుగను ఎంత ఉత్సాహంగా జరుపుకుంటామో అంతే ఉత్సాహంతో బీహార్ ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

వరుస సమావేశాలు

ఆదాయం పన్ను శాఖ, పోలీసు శాఖ, ఇతర ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో ఎన్నికల కమిషన్ ఆదివారం వరుస సమావేశాలు జరిపింది. స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన కార్యాచరణ పథకంపై సమీక్ష జరిపింది. అనంతరం చీఫ్ ఎలక్టోరల్ అధికారులు, రాష్ట్ర పోలీస్ నోడల్ అధికారి, సెంట్రల్ సెక్యూరిటీ ఫోర్స్ ప్రతినిధులతో సమావేశమైంది. ఆ వెంటనే చీఫ్ సెక్రటరీ, డెరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఇతర బ్యూరోక్రాట్లతో రాష్ట్రస్థాయిలో సమన్వయంపై సమీక్ష జరిపింది.

# యుద్ధ విమానాల కింద సమాధి చేస్తాం

(మొదటి తరువాయి)

భారతీయ సైనిక, రాజకీయ నాయకులు చేసిన విఫల యత్నంగా వారు చేసిన తాజా ప్రకటనలని ఆయన వ్యాఖ్యానించారు. 0–6 స్కోరుతో ఓటమిపాలైన భారత నాయకులు మరోసారి అటువంటి ప్రయత్నం చేస్తే ఈసారి స్కోరు మరింత పెరుగుతుందని ఆయన నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ 0–6 స్కోరు గురించి ఆయన విశదీకరించలేదు.

# మా అభ్యంతరాలను గౌరవించాలి

(మొదటి తరువాయి)



కౌటిల్య ఎకనమిక్ కాంక్లేవ్(కేఈసీ 2025)లో జైశంకర్ ప్రసంగిస్తూ తమ వాణిజ్య చర్చలలో ఏకాభిప్రాయం కుదరనందునే నేడు అమెరికాతో కొన్ని సమస్యలు ఉన్నాయని అన్నారు. భారత్‌పై అమెరికా విధించిన సుంకాలను అన్యాయంగా అభివర్ణించిన ఆయన భారతీయ వస్తువులపై విధించిన 50 శాతం సుంకాలను వ్యతిరేకిస్తూ భారత్ చర్చలు జరుపుతోందని చెప్పారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లారా జాగ్రత్త..

(మొదటి తరువాయి)

పడిపోయాయని తెలిపారు. బీర్ల ధరలు, విస్కీ ధరలు పెంచిండని తెలిపారు. ఆడోళ్లకి ఫ్రీ బస్సు అన్నాడు.. మొగోళ్లకు డబల్ టికెట్ కొడుతున్నారని తెలిపారు. కేసీఆర్ తెచ్చిన పథకాలను బందు పెట్టిండు.. న్యూట్రిషన్ కిట్టు బందు.. కేసీఆర్ కిట్టు బందు.. బతుకమ్మ చీరలు బంద్ అయినాయన్నారు. కేసీఆర్ ఉండంగా ఎట్ల ఇచ్చిండు.. రేవంత్ రెడ్డి ఎందుకు బంద్ చేసిండు అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డిది కేవలం దోచుకునే ప్రభుత్వమని విమర్శించారు. మల్ల ఎటు చూసినా కేసీఆర్ రావాలనే గాలి మొదలైందని హరీశ్‌రావు తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ప్యాకేజి తెస్తా ప్యాకేజీ తెస్తా అన్నాడు.. రేవంత్ రెడ్డి వచ్చి ప్యాకేజ్ ఇస్తా అన్నాడు అని తెలిపారు. వరదలు వచ్చి రోజులు దాటినా ఒక్క రూపాయి అయినా రేవంత్ రెడ్డి ఇచ్చాడా అని ప్రశ్నించారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 10,000 ఇస్తామన్నారని.. ఒక రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. తొందర్లో కాంగ్రెస్ బాకీ కార్డులు కూడా నియోజకవర్గానికి వస్తాయన్నారు. ప్రతి ఇంటికి బాకీ కార్డులను చేర్చాలని సూచించారు. ప్రతి అక్కకు చెల్లెకు మహాలక్ష్మి కింద నెలకు 2500 ఇస్తానన్నాడని హరీశ్‌రావు తెలిపారు. 22 నెలలు నిండినై.. ఒక్కొక్క మహిళకు 55 వేల రూపాయలు కాంగ్రెస్ పార్టీ బాకీ పడిందని అన్నారు. ఎవరైనా కాంగ్రెస్ వాడు ఊర్లకు వస్తే 55 వేల రూపాయలు ఇచ్చి మాట్లాడండి అని గల్ల పట్టి నిలదీయాలన్నారు. 200 పెన్షన్ 2000 చేసింది కేసీఆర్ అని తెలిపారు. కేసీఆర్ ఇస్తున్న రెండు వేల పెన్షన్‌ను నాలుగు వేలు చేస్తానని రేవంత్ రెడ్డి అన్నాడని గుర్తుచేశారు. అవ్వకిస్తా, తాతకిస్తా, కోడలికిస్తా అన్నాడని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో వృద్ధులకు 44వేల రూపాయలు బాకీ పడిందని అన్నారు. రైతుబంధు 15వేలు ఇస్తా అన్నారని హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 15 వేలు ఇచ్చిందా అని ప్రశ్నించారు. పోయిన యాసంగికి 3 ఎకరాలకు ఇచ్చి మిగితా ఎగ్గొట్టిండని విమర్శించారు. కౌలు రైతుకి ఇస్తా, రైతుకి ఇస్తా అన్నాడని తెలిపారు. రైతుకు లేదు.. కౌలు రైతుకు లేదని అన్నారు. ఒక సంవత్సరంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తా అన్నాడని.. కానీ 5 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని తెలిపారు. రేవంత్ రెడ్డి అంటే చీఫ్ మినిస్టర్ కాదు.. కటింగ్ మాస్టర్ అని ఎద్దేవా చేశారు. పథకాలు కటింగ్ పెడుతాడు. కేసీఆర్ కట్టిన బిల్డింగ్ లకు రిబ్బన్ కత్తిరిస్తారని అన్నారు.

# ఆగేనా..సాగేనా?

(మొదటి తరువాయి)

**రిజర్వేషన్ల ఖరారుతో జోష్**

స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. తొలి విడత పరిషత్ ఎన్నికల కోసం ఈ నెల 9వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 75 జడ్పీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేశారు. వీటితో పాటు 764 ఎంపీటీసీలు, 1,653 గ్రామపంచాయతీలు, 14,786 వార్డులకు రిజర్వేషన్లను ఖరారు చేశారు. దీంతో బీసీలకు భారీ సంఖ్యలో పోటీ అవకాశం ఏర్పడింది. దీంతో గ్రామాలు, మండలస్థాయిలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. కొత్తగా ఖరారైన రిజర్వేషన్లతో ఆశావహులు చాలామంది అధికార, ప్రతిపక్ష పార్టీల నుంచి తామే అభ్యర్థులమనే ప్రచారం చేసుకుంటున్నారు. ఇప్పటికే గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులు ఎవరనే చర్చ ప్రజల్లో మొదలైంది. ఎవరెవరు బరిలో ఉంటన్నారు..? ఎవరు గెలిచే అవకాశాలున్నాయని ఆరా తీస్తున్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. అభివృద్ధి, సంక్షేమం పేరుతో కాంగ్రెస్ ఓటర్లకు వల వేసేలా వ్యూహ రచన చేస్తుంటే.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, కాంగ్రెస్ బాకీ కార్డు పేరుతో బీఆర్ఎస్ ప్రజల్లోకి వెళుతోంది.

అభ్యర్థుల వేట

స్థానిక ఎన్నికలపై దృష్టిపెట్టిన కాంగ్రెస్ పార్టీ.. జడ్పీటీసీ స్థానానికి పోటీ పడే ముగ్గురు పేర్లతో అభ్యర్థుల జాబితాను ఇప్పటికే అధిష్ఠానానికి పంపించారు. ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థులను జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేల సమక్షంలో ఎంపిక చేయనున్నారు. మరోవైపు వర్ధన్నపేట, పాలకుర్తి, భూపాలపల్లి, నర్సంపేట, పరకాల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో బీఆర్ఎస్ నేతలు పంచాయతీ, వార్డుల వారీగా సమావేశాలు నిర్వహించి గులాబీ శ్రేణుల్లో జోష్ నింపేలా ప్రచారం చేస్తున్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆరు జడ్పీలు బీఆర్ఎస్ ఖాతాలోనే ఉన్నాయి. వాటిలో మెజారిటీ జడ్పీ పీఠాలను కైవసం చేసుకోవాలని గులాబీ నేతలు కసరత్తు చేస్తున్నారు. ఇక బీజేపీ సైతం అభ్యర్థుల ఎంపికపై దృష్టి పెట్టింది. మూడు ప్రధాన పార్టీలు స్థానిక సంస్థల్లో సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతున్నాయి. మరోవైపు ఆశావహులు గ్రామాల్లో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. సద్దుల బతుకమ్మ, దసరా పండుగల్లో రాజకీయ ఉనికి చాటుకునే దిశగా వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. అయితే ఈ రిజర్వేషన్లు ఉంటాయా..? ఉండవా..? అన్న దానిపై స్పష్టత లేకపోవడం ఆశావహులను ఉత్కంఠకు గురిచేస్తున్నాయి. ఓ వైపు తాము బరిలో ఉంటామనే సంకేతాలు ఇస్తూనే.. ఖర్చుల విషయంలో చాలామంది వెనుకడుగు వేస్తున్నారు. పోటీదారులు దసరా దావత్‌లకు దూరంగానే ఉంటూ రాజకీయం నడిపినట్లుగా అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి.

రిజర్వేషన్ల ఝలక్

పదేళ్ల తరువాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. దీంతో చాలామంది ద్వితీయ శ్రేణి నేతలు తమ అదృష్టాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో పరీక్షించుకునేందుకు ఆరాటపడుతున్నారు. ఈ క్రమంలో రిజర్వేషన్లు ఆశావహుల ఆశలపై నీళ్లు చల్లాయి. ప్రధానంగా జనరల్, బీసీ కోటాలో పాగా వేయాలని ఆశించిన నేతలకు జడ్పీ చైర్మన్ పదవులు మింగుడు పడటం లేదు. ములుగు జిల్లాకు సంబంధించిన ఓ కీలక నేత జడ్పీ చైర్మన్ పదవిపై కన్నేశారు. అయితే అనూహ్యంగా ఎస్టీ మహిళకు ములుగు జడ్పీ పీఠం రిజర్వుడు కావటంతో సదరు నేతలకు ఆశాభంగం కలిగింది. హనుమకొండ జడ్పీ పీఠంపై కూడా కాంగ్రెస్, బీఆర్ఎసలో కీలక నేతలు కన్నేశారు. అయితే ఎస్సీ మహిళకు హనుమకొండ జడ్పీ పీఠం రిజర్వుడు కావటంతో సదరు నేతలు నిరాశకు గురయ్యారు. వరంగల్, జనగామ జడ్పీ చైర్మన్‌లు కూడా రిజర్వేషన్ కోటాలో పోవటంతో ఎన్నో ఏళ్లుగా ఆశతో ఉన్న నేతలకు రిజర్వేషన్లు ఝలక్ ఇచ్చాయి. ఇలా జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు కూడా రిజర్వేషన్లు కలిసి రాకపోవటంతో అనేక మంది ఆశావహులు మానసికంగా కుంగిపోతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ 42శాతం రిజర్వేషన్లపై కొందరు కోర్టును ఆశ్రయించటంతో ఆశావహుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఏదైనా జరిగుతే తమకు అనుకూలంగా రిజర్వేషన్లు మారుతాయనే ఆశతో కొందరు నేతలు ఉన్నారు. మరోవైపు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ప్రకటించిన క్రమంలో కేవలం భూపాలపల్లి జడ్పీ చైర్మనే బీసీలకు కేటాయించారు. ఆరు జడ్పీల్లో కేవలం ఒక్క స్థానమే కేటాయించారని బీసీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కోర్టు తీర్పుపై ఉత్కంఠ

కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ఇటీవల జీవో విడుదల చేసింది. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీలకు 27శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. వీటికి 42 శాతం బీసీ రిజర్వేషన్లు కలిపితే 69 శాతం రిజర్వేషన్లు అవుతాయి. రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు 50శాతం మించకూడదని గతంలో సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో సోమవారం సుప్రీంకోర్టులో తెలంగాణలో స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై విచారణ జరుగనుంది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందో అనే ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుత పరిస్థితుల్లో పెంచిన రిజర్వేషన్లకు కోర్టు బ్రేకులు వేస్తే ఎలా అనే చర్చ నడుస్తోంది. తీర్పును మరో తేదీకి వాయిదా వేస్తే.. తుది తీర్పు వచ్చే దాకా ప్రభుత్వం ఎదురుచూడక తప్పదని మరికొందరు పేర్కొంటున్నారు. ఒక వేళ కోర్టులో కేసు పెండింగ్ ఉండగానే ఎన్నికలకు వెళ్తే.. ఆ ఎన్నికలు సైతం కోర్టు రద్దుచేయొచ్చని, మహారాష్ట్రలో ఇలాంటి సంఘటనే జరిగిందని బీజేపీ నేత, ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పుపై రాజకీయాల్లో ఉత్కంఠ నెలకొంది. సాంకేతికంగా సాధ్యం కాకుంటే ఇటీవల ఖరారైన రిజర్వేషన్లు మారడం తప్పనిసరిగా కనిపిస్తోందనే ప్రచారం ఉంది. ఒకవేళ ఇదే జరిగితే బీసీలకు మళ్లీ పాత రిజర్వేషన్లే దిక్కయ్యే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ పరంగా 42శాతం రిజర్వేషన్లు అమలు చేయవచ్చననే ప్రచారం కూడా జరుగుతోంది. మొత్తానికి స్థానిక సంస్థల ఎన్నికలపై కోర్టు తీర్పు ప్రభావం ఉండటంతో అందరి దృష్టి సోమవారం సుప్రీంకోర్టు, 8వ తేదీన హైకోర్టు ఇచ్చే తీర్పులపై ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

# 'స్వశక్తి' చీరలతో భరోసా..

(మొదటి తరువాయి)

సిరిసిల్లలో చీరల ఉత్పత్తిని గత ఆగస్టు 15లోగానే పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినా పూర్తి కాకపోవడంతో సెప్టెంబరు 30 వరకు పొడిగించిన ఆ గడువు కూడా ముగిసింది. ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్లు సిరిసిల్లలో మరమగ్గాలపై వస్త్ర ఉత్పత్తి చివరి దశకు చేరుకోవడంతో స్వశక్తి మహిళలకు చీరలు అందించే విధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సోమవారం స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క బతుకమ్మ చీరల ఉత్పత్తిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించనున్నారు.

**మరమగ్గాల కార్మికులకు చేతి నిండా పని..**

సిరిసిల్ల మరమగ్గాల కార్మికులకు చేతినిండా ఉపాధి కలుగుతుందనే ఆలోచనతో చీరల ఉత్పత్తి ఆర్డర్లను అందించారు. నాణ్యతలో ఎలాంటి తేడా రాకుండా పలు చర్యలు తీసుకున్నారు. స్వశక్తి మహిళకు డ్రెస్ కోడ్‌గా ఉండే విధంగా ఉత్పత్తి చేసిన చీరలను పంపిణీ చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఉత్పత్తి చేసిన వస్త్రాన్ని ప్రాసెసింగ్, ప్రింటింగ్ పూర్తిచేసి వివిధ జిల్లాల్లోని గోదాముల్లో నిల్వ చేస్తున్నారు. మహిళలకు అందించే స్వశక్తి చీరను సిరిసిల్లలో ఆగస్టులో చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఆర్డర్లు అందించే ముందే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిజైన్లు పరిశీలించి ఖరారు చేశారు. గత ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరల ఆర్డర్లు 2017 నుంచి 2023 వరకు ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బతుకమ్మ చీరల్లో నాణ్యత లేదని నిలిపివేసింది. ప్రభుత్వం నుంచి ఆర్డర్లు లేకపోవడంతో వస్త్ర పరిశ్రమ ఒక్కసారిగా సంక్షోభంలో కూరుకుపోయింది. నేతన్నల ఆత్మహత్యలు, కార్మిక సంఘాల ఆందోళనలు, అనేక విషాద సంఘటనల మధ్య ప్రభుత్వం మళ్లీ సిరిసిల్ల నేతన్నల ఉపాధిని దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన చీరలను ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా స్వశక్తి సంఘాల మహిళలకు డ్రెస్ కోడ్‌గా ఉండే విధంగా నాణ్యమైన చీరలను ఉత్పత్తి చేయడానికి నిర్ణయించింది. ఇందులో భాగంగా సిరిసిల్ల మరమగ్గాల కార్మికుల పని కల్పించే దిశగా ఆర్డర్లను ఇవ్వడంతో కార్మికులకు నిరంతరంగా ఉపాధి కలుగుతుందని భరోసా వచ్చింది.

ఫ 3.17 కోట్ల మీటర్ల 'స్వశక్తి' బట్ట ఉత్పత్తి..

స్వశక్తి మహిళలకు ఏడాదికి రెండు చీరలు ఇచ్చే విధంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఆర్డర్లు ఇచ్చారు. మొదటి విడతగా ఈ సంవత్సరం జనవరి, మార్చి మాసంలో 4.30 కోట్ల మీటర్ల వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లు రావడంతో మరగ్గాల చప్పుళ్లు మళ్లీ నిరంతరం వినిపిస్తున్నాయి. సిరిసిల్ల మరమగ్గాలపైన 1.30 కోట్ల మీటర్ల చీరల ఉత్పత్తి జరుగుతోంది. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో కార్మికుల కొరత తీవ్రంగా ఉండడంతో స్వశక్తి చీరలు ఉత్పత్తి మొదట్లో వేగంగా జరగలేదు. తరువాత ఉత్పత్తి లక్ష్యం దిశగా వేగం పుంజుకుంది. గతంలో బతుకమ్మ చీరల ఉత్పత్తి కోసం తెలంగాణలోని వరంగల్, జగిత్యాల, నల్లగొండ, వికారాబాద్ లాంటి జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా నేత కార్మికులు సిరిసిల్లకు వచ్చి ఉపాధి పొందారు. బతుకమ్మ చీరలు ఉత్పత్తి ఆర్డర్లు రాకపోవడంతో కార్మికులు మహారాష్ట్రలోని బీవండి, షోలాపూర్, గుజరాత్‌లోని సూరత్ వంటి ప్రాంతాలకు వెళ్లారు. మరికొందరు ఇతర పనుల్లో స్థిరపడ్డారు. దీంతో స్వశక్తి చీరల ఉత్పత్తి ఇబ్బందికరంగా మారింది. సిరిసిల్లలో దాదాపు 30వేల వరకు మరమగ్గాలు ఉన్నాయి. ఇందులో జియోట్యాగింగ్ చేసిన మరమగ్గాలు 27 వేల వరకు ఉన్నాయి. ఇందులో స్వశక్తి చీరల ఉత్పత్తి 131 మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ(మ్యాక్స్)ల ద్వారా 9600 మరమగ్గాలపైన ఉత్పత్తి జరుగుతోంది. ఇప్పటివరకు 4.30కోట్ల మీటర్ల వస్త్ర ఉత్పత్తి ఆర్డర్‌లో 3.17 కోట్ల మీటర్లు ఉత్పత్తి జరిగింది. మరో వారం రోజుల్లో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోనున్నారు.

# దగ్గు మందు తయారీపై బీ కేర్‌ఫుల్

(మొదటి తరువాయి)

సంఘటనలు పునరావృతం కాకుండా చూడటం కోసం మందులను సహేతుకంగా సూచించేలా, నిఘా వ్యవస్థలను విస్తరించేలా చర్యలు తీసుకోవాలని కేంద్రం చెప్పింది. రివైజ్డ్ షెడ్యూల్ ఎమ్‌ను కట్టుదిట్టంగా పాటించాలని ఔషధాల తయారీ కంపెనీలన్నిటికీ చెప్పింది. దీనిని పాటించని కంపెనీల లైసెన్సులు రద్దవుతాయని హెచ్చరించింది. వైద్యులు దగ్గు మందులను సూచించేటపుడు హేతుబద్ధంగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలకు కేంద్రం తెలిపింది. ముఖ్యంగా చిన్నారులకు మందులను సూచించేటపుడు జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పింది. బాల్యంలో వచ్చే దగ్గు చాలా వరకు దానంతట అదే తగ్గుతుందని, ఔషధపరమైన చికిత్స అవసరం ఉండదని గుర్తు చేసింది. నిఘాను పెంచాలని, ఆరోగ్య కేంద్రాల్లో ఏమైనా ప్రతికూల పరిస్థితులు, సంఘటనలు జరిగితే, వెంటనే సకాలంలో తెలియజేయాలని చెప్పింది. ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫామ్ కిందనున్న కమ్యూనిటీ రిపోర్టింగ్ టూల్ గురించి అవగాహనను పెంచాలని తెలిపింది. రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని పెంచుకోవాలని కూడా సూచించింది. ఈ సమావేశం కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి పుణ్య సలిల శ్రీవాస్తవ అధ్యక్షతన జరిగింది.

**స్రేసన్ ఫార్మాస్యూటికల్స్‌పై చర్యలకు సిఫారసు**

ఎపిడమాలజిస్టులు, మైక్రో బయాలజిస్టులు, ఎంటమాలజిస్టులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లతో కూడిన కేంద్ర నిపుణుల బృందం మధ్య ప్రదేశ్‌లోని ఛింద్వారా, నాగపూర్‌లలో పర్యటించింది. బాలల మరణాలపై రాష్ట్ర అధికారులతో సమన్వయం చేసుకుని, విశ్లేషణ జరిపింది. క్లినికల్, ఎన్విరాన్‌మెంటల్, ఎంటమాలాజికల్, డ్రగ్ శాంపిల్స్‌ను సేకరించి, పుణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ, నాగపూర్‌లోని ఎన్ఈఈఆర్ఐ, ముంబైలోని సెంట్రల్ డ్రగ్ లేబరేటరీలకు పంపించింది. సాధారణ అంటు వ్యాధుల అవకాశాలను ప్రాథమిక పరీక్షల ఫలితాలు తోసిపుచ్చాయి. ఒక కేసులో మాత్రమే లెప్టోస్పిరోసిస్ పాజిటివ్ కనిపించింది. చిన్నారులు వాడిన 19 మెడిసిన్ శాంపిల్స్‌ను ప్రైవేట్ ప్రాక్టీషనర్స్, సమీపంలోని రిటెయిల్ స్టోర్స్ నుంచి సేకరించారు. 10 శాంపిల్స్ కెమికల్ విశ్లేషణలో 9 నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు వెల్లడైంది. కోల్డ్రిఫ్ దగ్గు మందులో డీఈజీ అనుమతించదగిన పరిమితి కన్నా అధికంగా ఉన్నట్లు వెల్లడైంది. దీంతో కోల్డ్రిఫ్‌ను తయారు చేస్తున్న స్రేసన్ ఫార్మాస్యూటికల్స్ కంపెనీపై తమిళనాడు రెగ్యులేటరీ అథారిటీ ఎఫ్‌డీఏ చర్యలు తీసుకుంది. దీని లైసెన్సును రద్దు చేయాలని సీడీఎస్‌సీఓ సిఫారసు చేసింది. ఈ కంపెనీపై క్రిమినల్ చర్యలను కూడా ప్రారంభించారు.

## 2025 అక్టోబర్ 6, సోమవారం తెలుగు పంచాంగం




మాసం- పక్షం

ఆశ్వయుజ మాసం

శుక్ల పక్షం

తిథి

చతుర్దశి: అక్టోబర్ 5 మధ్యాహ్నం 3:04 అక్టోబర్ 6 ఉదయం 11:38 వరకు

పౌర్ణమి: అక్టోబర్ 6 ఉదయం 11:38 అక్టోబర్ 7 ఉదయం 8:27 వరకు

నక్షత్రం

పూర్వభాద్రపద: అక్టోబర్ 5 ఉదయం 8:01 అక్టోబర్ 6 ఉదయం 6:28 వరకు

ఉత్తరభాద్రపద: అక్టోబర్ 6 ఉదయం 6:28 అక్టోబర్ 7 ఉదయం 5:19 వరకు

శుభ సమయాలు

బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:34 - 5:22

అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:41 - 12:28

అమృతకాలం: సాయంత్రం 5:24 -6:55

అశుభ సమయాలు

రాహుకాలం: ఉదయం 7:39- 9:07

యమగండం: సాయంత్రం 3:01- 4:30

గుళికా: ఉదయం 10:36 - 12:05


దుర్ముహూర్తం: ఉదయం 11:45 -12:33, రాత్రి 10:38 - 11:26

వర్జ్యం: మధ్యాహ్నం 2:12- 3:43

# సమ్మక్క -సారక్క గద్దెలు పునర్నిర్మాణ పనుల పరిశీలన

## కాకా జయంతి వేడుకలు ఘనంగా





**రామగుండం,అక్టోబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆదివారం గోదావరి బ్రిడ్జి సమీపంలోని సమ్మక్క -సారక్క గద్దెలు పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను వేగంగా పూర్తి చేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు సమగ్రంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. పనుల నాణ్యతను కాపాడుతూ, గడువు లోపల పూర్తి చేయాలని సూచించారు. అదేరోజు, మాజీ కేంద్ర మంత్రి, కార్మిక లోక నాయకుడు గడ్డం వెంకటస్వామి (కాకా) 96వ జయంతిని పురస్కరించుకొని, రామగుండం జీఎం ఆఫీస్ టర్నింగ్ వద్ద ఉన్న విగ్రహానికి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. “కాకా గారు ప్రజా సేవా మార్గంలో అజరామరమైన చరిత్ర సృష్టించారు. ఆయన చూపిన మార్గం మనందరికీ ప్రేరణ” అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఇక పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు సుల్తానాబాద్ పట్టణ కేంద్రంలోని కాకా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ మినిపల ప్రకాష్ రావు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆర్ఎస్ఎస్ విజయదశమి ఉత్సవాలు





**నేరేడ్మెట్, అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల శుభారంభంగా మల్కాజిగిరి భాగ్ పరిధిలోని నేరేడ్మెట్ నగర్‌లో విజయదశమి వేడుకలు వైభవంగా నిర్వహించబడ్డాయి. ఆర్‌కె పురం, సైనిక్‌పురి, కృపా కాంప్లెక్స్ బస్తీల్లో జరిగిన ఈ కార్యక్రమాలు స్వయంసేవకుల ఉత్సాహభరిత పాల్గొనడం, ప్రజల విశేష స్పందనతో మరింత ఘనతను సంతరించుకున్నాయి.ఆర్‌కె పురంలో రిటైర్డ్ లెఫ్టినెంట్ కల్నల్ బి ఎల్ ఎన్ ప్రసాద్, సైనిక్‌పురిలో చిత్తప్రగడ సూర్యనారాయణ శర్మ, కృపా కాంప్లెక్స్‌లో పిట్ల శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై సంఘ్ సేవా ప్రస్థానాన్ని ప్రశంసించారు. వక్తలుగా వూటుకూరి శ్రీనివాస్, భూక్య నరేష్, మంచూరి అమర్నాథ్ రెడ్డి ప్రసంగించి ఆర్ఎస్ఎస్ స్థాపన, హెడ్గేవార్ జీవిత విశేషాలు, సంఘ్ శతాబ్ది సేవా యాత్రను వివరించారు. నగర సంగచాలకులు సిరిప్రగడ రాజేంద్రరావు, మల్కాజిగిరి భాగ్ సహ కార్యవః కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.శతాబ్ది లక్ష్యంగా ప్రకటించిన ‘పంచ పరివర్తన్’ అంశంపై వక్తలు విశదంగా చర్చించారు. వ్యక్తిగత, కుటుంబ, సమాజ, దేశ, ప్రకృతి పరిరక్షణ అనే ఐదు మార్గాల్లో మార్పు తీసుకురావడం ద్వారా సమాజంలో సానుకూల పరిణామాలు చోటుచేసుకుంటాయని పేర్కొన్నారు.

# బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల సమావేశం





**మంచాల, అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆరుట్ల గ్రామంలో బీజేపీ గ్రామ కన్వీనర్ కొత్తపల్లి శేఖర్ గౌడ్, కో కన్వీనర్ మెండు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎంపీటీసీ, సర్పంచ్, వార్డ్ మెంబర్ల పరిధిలో సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ మండల అధ్యక్షుడు నూకం రాజు ముదిరాజ్ హాజరై, ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు పాండాల జంగయ్య గౌడ్, మెన్ పి ఎస్ ఎస్ డైరెక్టర్ కొంగర జనార్దన్ రెడ్డి, మెండు వెంకటరెడ్డి, కొత్తపల్లి మహేందర్ గౌడ్, సత్తిరెడ్డి, గంట నరసింహారెడ్డి, మందం మోహన్ రెడ్డి, భగవంతు రెడ్డి, నరసింహారెడ్డి, గుడ్డి మల్లి సత్యనారాయణ ముదిరాజ్, తంగడపల్లి నరేందర్ గౌడ్, పెద్దిరెడ్డి యాదగిరి రెడ్డి, వేరే రవీందర్ రెడ్డి, అచ్చిన రవీందర్, గంట రాజు రెడ్డి, రవీందర్ రెడ్డి, కర్ణాకర్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, దయాకర్ రెడ్డి, సంతోష్, జగన్ రెడ్డి, కందాల నరేష్, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించారు. పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాల్సిన అవసరం ఉందని నేతలు పేర్కొన్నారు.

# ఉపాధ్యాయుడి బోధనలే భవిష్యత్ తరాలకు వెలుగు దారులు

**వనపర్తి సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో ఘన సన్మానం**





**వనపర్తి,అక్టోబర్ 05( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మనిషి జీవితాన్ని మలిచే శిల్పి గురువు. ఆయన బోధనలే భవిష్యత్ తరాలకు వెలుగుదారి.
ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని వనపర్తి జిల్లా సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వల్లబ్ నగర్ రేడియంట్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఇటీవల విరామం పొందిన ఉపాధ్యాయులు బి. శ్రీనివాసులు, వెంకటేష్ గౌడ్ లతో పాటు యువ కవి గంగవరం రామకృష్ణారెడ్డిలను “ఉత్తమ ఉపాధ్యాయులుగా” గుర్తించి సన్మానించారు. సాహితీ కళావేదిక అధ్యక్షుడు శంకర్ గౌడ్ మాట్లాడుతూ – “శ్రీనివాసులు, వెంకటేష్ గౌడ్ లు తమ బోధనతో ఎన్నో తరాలను స్ఫూర్తిపరిచారు. అదే స్ఫూర్తితో సాహిత్య రంగంలో అడుగుపెట్టిన రామకృష్ణారెడ్డి రచించిన ‘కాళీ కుర్చీలు’ పుస్తకాన్ని త్వరలోనే సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో ఆవిష్కరించనున్నాము. ఆయనను వనపర్తి యువకవిగా పరిచయం చేయడం గర్వకారణం” అని తెలిపారు.సన్మాన గ్రహీతలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ – “ఉపాధ్యాయ సేవను గుర్తించిన సాహితీ కళావేదికకు కృతజ్ఞతలు. ఈ సన్మానం మాకు మరింత బాధ్యతను, ప్రేరణను ఇస్తుంది” అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు, డి రాములు యాదవ్, నారాయణరెడ్డి, యూసుఫ్ రచయితలు నిరంజన్ అయ్యా, బుచ్చిబాబు,మహంతయ్య,గాయకులు రాజారామ్ ప్రకాష్, నాగరాజు,సత్తార్,రామ్ రెడ్డి,వీరాచారి సహజ కవులు, సాహితీ హితులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వయోవృద్ధులకు సేవా కార్యక్రమాలు




**ఆమనగల్లు, అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఇ ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, లయన్స్ క్లబ్ ఆఫ్ బాలాజీ నగర్ సంయుక్తంగా వృద్ధుల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహించాయి. లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ డి. మహేంద్ర కుమార్ రెడ్డి నేతృత్వంలో 40 వేల వాటర్ బాటిల్స్‌ను వయోవృద్ధులకు అందజేశారు. ఈ సందర్భంగా మెగా ఉచిత ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి, వృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపారు.ఆరోగ్య శిబిరాల్లో నేత్ర పరీక్షలు, దంత పరీక్షలు, మానసిక స్థితి పరిశీలన, ఆర్థోపెడిక్, హియరింగ్, ఆయుర్వేద చికిత్సలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. వివిధ విభాగాల వైద్యులు వృద్ధులకు అవసరమైన వైద్య సమాచారం, చికిత్సలపై అవగాహన కల్పించారు. క్లబ్ మాజీ గవర్నర్ జి. చెన్న కిషన్ రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి ఈ వివరాలు వెల్లడించారు.లయన్స్ క్లబ్ పిఆర్‌ఓ పాషా తెలిపిన వివరాల ప్రకారం, వృద్ధులకు నాలుగు వేల వాటర్ బాటిల్స్‌తో పాటు ఇరవై వేలు నగదు సహాయం అందజేయబడింది. ఈ కార్యక్రమంలో ఫస్ట్ వైస్ గవర్నర్ సురేష్ జిగ్నానీ, సెకండ్ వైస్ గవర్నర్ శ్రీకాంత్, రీజియన్ చైర్మన్ జనార్దన్ రెడ్డి, జోన్ చైర్మన్ జూలూరు లింగయ్య, జిల్లా చైర్మన్ ఓంకారం, జూలూరి రమేష్, మిట్టపల్లి అంజయ్య, సునంద గుజ్జరి నరసింహ, క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, పిఆర్‌ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గడ్డం వెంకటస్వామి 96వ జయంతి వేడుకలు







**ఎలిగేడు, అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు మండల కేంద్రంలో ఆదివారం కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి 96వ జయంతి వేడుకలు అభిమానుల ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దుగ్యాల సంతోష్ రావు మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అయిన గడ్డం వెంకటస్వామి పెద్దపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఆదర్శ నేతగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన సేవా దృక్పథం తాము అనుసరించాల్సిన మార్గదర్శకమని అభిప్రాయపడ్డారు.వేడుకల్లో వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, ఎలిగేడు బస్టాండ్ సమీపంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వందలాది మంది అభిమానులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పిఎసిఎస్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, మాజీ చైర్మన్ నరహరి సుధాకర్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ తాటిపల్లి రమేష్ బాబు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాజనర్సయ్య, మాజీ ఉప సర్పంచ్‌లు కోరుకంటి వెంకటేశ్వరరావు, గుడుగుల మహేందర్, అడ్డగుంట శ్రీనివాస్ గౌడ్, చింతకుంట మనోహర్ రావు, మామిడాల రమేష్, తిరుపతి గౌడ్, కవంపల్లి కొండయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# గోదల శ్రీనివాసరెడ్డి ప్రథమ వర్ధంతి.

## నివాళులర్పించిన జిల్లా గ్రంథాలయ చైర్మన్.



**ఎలిగేడు, అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మండలంలోని బురహాన్మియాపేట్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎలిగేడు మాజీ సింగిల్ విండో చైర్మన్ గోదల శ్రీనివాస్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం జిల్లా గ్రంథాలయాల చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు రైతులకు చేసిన సేవలను గుర్తు చేశారు. ఆయనతోపాటు నర్సాపూర్ మాజీ ఉపసర్పంచ్ పల్లెర్ల వెంకటేష్ కాంగ్రెస్ నాయకులు కొండ తిరుపతి గౌడ్ తదితరులు పాల్గొని ఘన నివాళులర్పించారు.

# వసతులతో కూడిన న్యాయస్థానాల ద్వారా అందరికీ న్యాయఫలాలు దక్కాలి

## తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్

**వనపర్తి అక్టోబర్ 5 (నీలగిరి ఎక్స్ ప్రెస్ న్యూస్):** వసతులతో కూడిన న్యాయస్థానాల ద్వారా అందరికీ న్యాయం చేకూరాలని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ఆకాంక్షించారు. వనపర్తి జిల్లా కేంద్రంలో రూ.81 కోట్ల వ్యయంతో 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న నూతన కోర్టు సముదాయానికి (పోక్సో, ఫ్యామిలీ కోర్టులతో కలిపి) ఆయన ఆన్లైన్ ద్వారా శిలాఫలక ఆవిష్కరణ చేశారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తులు అనిల్ కుమార్ జూకంటి, మాధవి దేవి భూమిపూజ, శంకుస్థాపన చేశారు.కార్యక్రమానికి రిటైర్డ్ జడ్జి, తెలంగాణ ఈఆర్సీ ఛైర్మన్ డి.నాగార్జున, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ గిరిధర్ రావుల, జిల్లా న్యాయమూర్తి ఎం.ఆర్. సునీత, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, పీపీ కిరణ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ విజయదశమి పర్వదినంలో వనపర్తి నూతన కోర్టు భవనానికి శంకుస్థాపన జరగడం శుభ సూచకమని అన్నారు. జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి న్యాయ వ్యవస్థ బలోపేతానికి మౌలిక సదుపాయాలు కీలకమని పేర్కొన్నారు. జస్టిస్ మాధవి దేవి వనపర్తి చారిత్రక న్యాయ పరంపరను గుర్తుచేసుకుంటూ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి కృషిని ప్రస్తావించారు.కలెక్టర్ ఆదర్శ్ సురభి ఈ రోజు తనకు మరచిపోలేని రోజు అని, అందరికీ న్యాయఫలాలు దక్కాలని ఆకాంక్షించారు. రిటైర్డ్ జడ్జి నాగార్జున, ఎస్పీ గిరిధర్ రావుల, బార్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడారు. ముఖ్య అతిథులను బార్ అసోసియేషన్ సభ్యులు శాలువాలతో సత్కరించారు.




# జైపూర్‌లో జాతీయ సమావేశాలకు బయలుదేరిన తపస్ బృందం





**హైదరాబాద్, అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో అక్టోబర్ 5, 6, 7 తేదీలలో నిర్వహించనున్న అఖిల భారతీయ శైక్షిక మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) జాతీయ సమావేశాలకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ ి ప్రతినిధుల బృందం ఆదివారం శంషాబాద్ విమానాశ్రయం నుండి బయలుదేరింది. తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేశ నేతృత్వంలో నారాయణపేట్ బృందం ఈ సమావేశాల్లో పాల్గొననుంది.ఈ సందర్భంగా పూజారి రమేశ మాట్లాడుతూ, మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు దేశవ్యాప్తంగా విద్యారంగ సమస్యలు, జాతీయ భావాల పెంపు, దేశాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర వంటి అంశాలపై చర్చించనున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు నిర్వహించాల్సిన కార్యక్రమాలు, సమాజంలో వారి బాధ్యతలపై స్పష్టమైన దిశానిర్దేశం ఈ వేదిక ద్వారా అందుతుందని పేర్కొన్నారు.ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం నుండి తపస్ రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు కానుగంటి హనుమంతరావు, నవాత్ సురేష్, రంగారెడ్డి జిల్లా నుండి ఏబీఆర్ఎస్ఎం బాధ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర బాధ్యులు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేశతో పాటు దాదాపు 170 మందికి పైగా తపస్ రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి బాధ్యులు మరియు మహిళా కార్యకర్తలు జైపూర్‌కు చేరుకున్నారు.విద్యారంగ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న తపస్ బృందం ఈ జాతీయ వేదికపై తెలంగాణ రాష్ట్రం తరపున తన విశిష్టతను చాటనుంది. ఉపాధ్యాయుల శ్రేయస్సు, విద్యా ప్రమాణాల పెంపు, దేశాభివృద్ధి లక్ష్యంగా తపస్ సంస్థ చేపట్టిన ఈ ప్రయాణం, జాతీయ స్థాయిలో తెలంగాణ ప్రతినిధిత్వాన్ని మరింత బలపరచనుంది.

# పరుగు పందెంలో కానిస్టేబుల్ చందన్ సింగ్ ప్రతిభ




**కడ్తాల్, అక్టోబర్ 5 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
: తెలంగాణ అల్ట్రా మారథాన్ రన్నింగ్ పోటీలు రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల శివారులోని పిరమిడ్ లో ఆదివారం నిర్వహించారు. కడ్తాల్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ చందన్ సింగ్ 5 కిలోమీటర్ల పరుగు పందెంలో ఫస్ట్ ప్రైజ్ సాధించారు. ఈ సందర్భంగా కడ్తాల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ సిహెచ్ గంగాధర్, సబ్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్, చంద్రశేఖర్ , పోలీస్ సిబ్బంది చందన్ సింగ్ ను అభినందించారు.

# హై టెన్షన్ లైన్ అలైన్ మెంట్ మార్చే వరకు ఉద్యమం మరింత ఉద్ధృతం చేస్తాం



**కడ్తాల్, అక్టోబర్ 5 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )**
కడ్తాల్ మండలం నుంచి వెళ్తున్న 765కేవి విద్యుత్ హై టెన్షన్ లైన్ రద్దుకై రైతులు ఆందోళన కొనసాగుతుంది. ఆదివారం కడ్తాల్ 765కేవీ పరిరక్షణ కమిటీ సమావేశమైంది. కడ్తాల్ పరిరక్షణ ధ్యేయంగా ముందుకు సాగేందుకు కార్యచరణ సిద్ధం చేశారు. బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచనలు, రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని వివిధ నిరసన కార్యక్రమాల ద్వారా చేపట్టిన ప్రభుత్వాలు స్పందించక పోవడంతో రైతులు భవిష్యత్తు కార్యాచరణ రూపొందించారు. హై టెన్షన్ లైన్ అలైన్ మెంట్ మార్చే వరకు ఉద్యమం కొనసాగిస్తామని రైతులు వాపోయారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు సుమారు 55 మంది రైతులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో .**




**దేవరకొండ అక్టోబర్ 05.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవన్ నందు అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరకొండ నియోజకవర్గం లోని ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి ప్రశంసా పత్రం అందించి వారిని సన్మానించారు . ఈ వేడుకలో సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదని దేశాన్ని చక్కదిద్దే బాధ్యత గురువులపైనే గురుతర బాధ్యత ఉంటుదని,తల్లి,తండ్రి మొదటి గురువు అయితే ప్రపంచాన్ని ఏలే శక్తి, సామర్థ్యాలను, జ్ఞానాన్ని ప్రసాదించే రెండవ గురువు ఉపాధ్యాయుడు అని కొనియాడారు. ఉపాధ్యాయుడు విద్యార్థులకు చరిత్రను మార్చే విధంగా జ్ఞానాన్ని అందిస్తూ పవిత్రమైనటువంటి విద్యను ఉన్నత శిఖరాలకు చేరే విధంగా తయారు చేయాలని కోరారు. అందరికీ అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లేటి భాస్కరాచారి వరికుప్పల శీను, రంజాన్ బేగ్ లౌడ్య భాషానాయక్ శేరిపల్లి జయలక్ష్మి, రెడ్డి కోటేశ్వరరావు, తోటపల్లి శ్రీను, ఎండి అబ్దుల్ కలాం, పావురాల కొండల్ యాదవ్, శివగౌడ్, లింగయ్య, అంకం చంద్రమౌళి, తాటికొండ నరసింహ, సిగ శీను, కిరణ్ కుమార్,మెరుగు శీను, అద్దంకి శీను మరియు వివిధ పాఠశాల నుంచి ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీతలు పాల్గొన్నారు.

# ఫ్రీ బస్ అడిగింది ఎవరు? చార్జీలు పెంచమన్నది ఎవరు?

**కర్రెడ్ల నరేందర్ రెడ్డి**



**మహేశ్వరం, అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ సాంస్కృతిక శాఖ కో కన్వీనర్ కర్రెడ్ల నరేందర్ రెడ్డి శనివారం మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రకటించిన ఆరు హామీల్లో 'ఫ్రీ బస్' అంశంపై తీవ్రంగా స్పందించారు. "ఆడవాళ్లకు ఉచిత బస్సు ప్రయాణం అంటూ ప్రకటించి, ఇప్పుడు చార్జీలు పెంచి మగవాళ్ల జేబులు ఖాళీ చేయడం సరికాదు" అని ఆయన పేర్కొన్నారు."ఫ్రీ బస్ అడిగింది ఎవరు? ఇప్పుడు చార్జీలు పెంచమన్నది ఎవరు? ప్రజలను మభ్యపెట్టి, అధికంగా వసూలు చేయడం అన్యాయమని హెచ్చరిస్తున్నాం. మీకు చేతనైన హామీలను మాత్రమే ప్రకటించి ప్రజల్లోకి రావాలి. లేదంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే గుణపాఠం చెబుతారు" అని నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే పెంచిన చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే న్యాయమైన విధానాలు పాటించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

# రంగారెడ్డి జిల్లాలో ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా రద్దు



**రంగారెడ్డి,అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లాలో స్థానిక ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో, జిల్లా కలెక్టరేట్ నందు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలు ముగిసిన అనంతరం ప్రజావాణి కార్యక్రమం మళ్లీ కొనసాగుతుందని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు, పిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# గోదల శ్రీనివాసరెడ్డి జ్ఞాపకార్థం స్వాగత కమాన్ ప్రారంభం

**-ఎమ్మెల్యే విజయరమణారావు ఘన నివాళి**




**ఎలిగేడు, అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు మండలంలోని బురహాన్మియాపేట్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఎలిగేడు మాజీ సింగిల్ విండో చైర్మన్ గోదల శ్రీనివాసరెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి శాసనసభ సభ్యుడు చింతకుంట విజయరమణారావు పాల్గొని శ్రీనివాసరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, శ్రీనివాసరెడ్డి ప్రజల కోసం, రైతుల కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన సేవా దృక్పథం ప్రతి నాయకుడికి ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. అనంతరం ఆయన జ్ఞాపకార్థంగా గ్రామ శివారులో నిర్మించిన స్వాగత కమాన్‌ను కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో గోదల శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై, శ్రీనివాసరెడ్డి సేవలను స్మరించుకుంటూ కార్యక్రమాన్ని మరింత ఘనతతో నిర్వహించారు.

# జాగృతి అధ్యక్షురాలికి ధన్యవాదాలు తెలిపిన కప్పాటి పాండురంగారెడ్డి

**కందుకూరు, అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కందుకూరు మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తనను రంగారెడ్డి జిల్లా జాగృతి అధ్యక్షుడిగా నియమించినందుకు పూల బొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. నగరంలోని జాగృతి ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో పాండురంగారెడ్డితో పాటు మహేశ్వరం నియోజకవర్గ జాగృతి ఇంచార్జీగా నియమితులైన అందుగుల సత్యనారాయణ, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా బండారి లావణ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు కోల శ్రీనివాస్, అర్చన సేనాపతి, నాయకులు ఉండెల బాబురావు, సభావట్ గణేష్ నాయక్, రవి నాయక్, సుజాత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ, అధ్యక్షురాలు తనపై ఉంచిన




నమ్మకాన్ని వమ్ము చేయకుండా, సంస్థ నియమాలకు లోబడి, జాగృతి అభివృద్ధి కోసం నిబద్ధతతో పనిచేస్తానని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుతూ, పేదల పక్షాన నిలబడి పార్టీకి, ప్రజల అభిమానానికి అర్హత సాధించేలా కృషి చేస్తానని తెలిపారు. జాగృతి సంస్థ ద్వారా ప్రజలలోకి చేరి, వారి అవసరాలను గుర్తించి, సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు తన బాధ్యతలను వినియోగిస్తానని పాండురంగారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## మిర్యాలగూడ నియోజకవర్గ సమస్యలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి వినతిపత్రం


**మిర్యాలగూడ, అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**



మిర్యాలగూడ నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి సంబంధించి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావును ఆదివారం బీజేపీ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయ స్థాపన అంశంతో పాటు, నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో దృశ్య కార్యకర్తలకు దిశానిర్దేశం చేసి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు సూచించారు. కార్యకర్తల నిబద్ధత, ప్రజలతో సంబంధం, పార్టీ విజయానికి కీలకమని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డిని కూడా కలిసి పార్టీ కార్యాలయం, నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. పార్టీ అభివృద్ధికి ప్రతి స్థాయిలో సమన్వయం అవసరమని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వనం మదన్ మోహన్, రాజశేఖర్ నాయక్, దైద రవి, మనీలాల్ నాయక్, కూరాకుల రవికుమార్, సత్యం, వేణు, అంకె పాక అంజయ్య, యశ్వంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. నాయకుల సమిష్టి సమర్పణతో కార్యక్రమం సజావుగా కొనసాగింది.

## మిత్ర ఫౌండేషన్ నూతన అధ్యక్షుడిగా కుకుడాల శ్రీకాంత్ నేత ఎన్నిక

**కల్వకుర్తి, అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**




కల్వకుర్తి పట్టణ కేంద్రంలో మిత్ర ఫౌండేషన్ మూడవ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్ చౌరస్తాలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించబడింది. గత మూడు సంవత్సరాలుగా మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్య, ఆరోగ్యం, ఆర్థిక సహాయం, సామాజిక కార్యక్రమాలు వంటి అనేక సేవా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడుతున్నాయి. ఈ సందర్భంగా మిత్ర సభ్యుల సమక్షంలో కుకుడాల శ్రీకాంత్ నేతను మిత్ర ఫౌండేషన్ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా రావుఫ్, కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా రాఘవేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కార్తీక్, దేవర్ల మహేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా తరుణ్, శ్రీకాంత్ గౌడ్, సలీం తదితరులు బాధ్యతలు స్వీకరించారు. నూతన అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ, “సమాజానికి మా వంతు సేవగా విద్య, ఆరోగ్యం, ఆర్థిక సహాయం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో మిత్ర ఫౌండేషన్ మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడుతుంది. ప్రజల అవసరాలను గుర్తించి, సహాయంగా నిలవడం మా లక్ష్యం” అని తెలిపారు.

## మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి,అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



పెద్దపల్లి కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించిన మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి (కాకా) జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “మహనీయులను ఆదర్శంగా తీసుకొని, వారి స్ఫూర్తితో ప్రజాసేవలో ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలి” అని అన్నారు. మారుమూల ప్రాంతంలో జన్మించి, దేశ రాజకీయాల్లో, కార్మిక హక్కుల సాధనలో అజరామరమైన చరిత్ర సృష్టించిన వెంకటస్వామి ఈ ప్రాంతానికి చెందినవారై ఉండటం గర్వకారణమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అరుణ శ్రీ కూడా పాల్గొన్నారు.

## సిటీ బస్సు ఛార్జీల పెంపుపై బీఆర్ఎస్ నేత రవీందర్ యాదవ్ తీవ్ర విమర్శ



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

హైదరాబాద్ జంట నగరాల్లో సిటీ బస్సు కనీస ఛార్జీని ఏకంగా రూ.10 పెంచిన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయంపై బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, శేరిలింగంపల్లి యువనేత రవీందర్ యాదవ్ తీవ్ర స్థాయిలో స్పందించారు. ఈ నిర్ణయం పేద, మధ్యతరగతి ప్రజలపై భారం మోపే కుట్రగా అభివర్ణిస్తూ, “ఒకేసారి రూ.10 పెంచడం దుర్మార్గం” అని మండిపడ్డారు. “పేదల జేబులు గుల్ల చేస్తున్న కాంగ్రెస్ సర్కార్, బడుగుజీవులు, దినసరి కూలీలు ఎలా బతకాలి?” అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. “విద్యార్థుల బస్ పాస్ ఛార్జీలు, టీ-24 టిక్కెట్ల ధరలు పెంచిన తర్వాత కూడా కనీస ఛార్జీపై కనికరం లేకుండా 50 శాతం పెంపు చేయడం అసమర్థతకు నిదర్శనం” అని విమర్శించారు.“కెసిఆర్ పాలనలోనే పేదలకు సంక్షేమం కనిపించింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టి, మోసపూరిత విధానాలతో ముందుకు సాగుతోంది. బీఆర్ఎస్ పార్టీ దీని పై పోరాటానికి సిద్ధంగా ఉంది. రానున్న ప్రతి ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారు. బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుంది” అని రవీందర్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. “సీఎం రేవంత్ రెడ్డి వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి” అంటూ డిమాండ్ చేశారు. ప్రజల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు.

## బిఆర్ఎస్ ఎల్పీ విప్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన శంభీపూర్ కృష్ణ



**దుండిగల్,అక్టోబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ తన పుట్టిన రోజు సందర్భంగా కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ గారి నివాస కార్యాలయాన్ని శనివారం మర్యాదపూర్వకంగా సందర్శించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ గారు శంభీపూర్ కృష్ణను ఆశీర్వదిస్తూ, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని, ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని శంభీపూర్ కృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలతో పాటు, పార్టీ అభివృద్ధి, ప్రజాసేవపై చర్చలు కూడా సాగినట్లు సమాచారం.



కరీంనగర్ జిల్లా పర్యటనలో భాగంగా టీజీఎండీసీ ఎండి భవేష్ మిశ్రా కలెక్టర్ పమేలా సత్పతిని కరీంనగర్ కలెక్టరేట్ ఛాంబర్లో మర్యాద పూర్వకంగా కలిశారు.

## స్థానిక సంస్థల ఎన్నికల సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ




**లింగాల, అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

అచ్చంపేట పట్టణ కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రజా భవనంలో లింగాల మండల స్థానిక సంస్థల ఎన్నికల సమీక్ష సమావేశం శనివారం నిర్వహించబడింది. ఈ సమావేశంలో టిపిసిసి ఉపాధ్యక్షులు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రంగినేని శ్రీనివాస్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు విషయంలో పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. నాయకుల మధ్య సమన్వయ లోపం లేకుండా జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ అధిష్టానం ప్రకటించిన అభ్యర్థి విజయం కోసం ప్రతి కార్యకర్త, నాయకుడు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలు అధైర్యపడకుండా ధైర్యంగా ముందుకు సాగాలని, రిజర్వేషన్లపై అపోహలు నమ్మవద్దని, పార్టీ వారి సేవలను తప్పకుండా గుర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రతి మండలంలో తొమ్మిది నుండి పన్నెండు మందితో కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మండల స్థాయి పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశం సజావుగా కొనసాగింది.

## అకాల వర్షాలతో పంట నష్టం

### అన్నదాతకు తీరని నష్టం



**ఎలిగేడు, అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

ఎలిగేడు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షాలు రైతులను తీవ్రంగా కుంగదీసాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే దశలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం రావడంతో వరి పొలాలు నేలకొరిగాయి. దూళికట్ట గ్రామానికి చెందిన సందనవేణి రాజయ్య వరి పంటతో పాటు మరికొందరు రైతుల పంటలు పూర్తిగా నాశనమయ్యాయి. వర్షం తీవ్రత కారణంగా పంటలకు గాయాలు కలగడంతో పెట్టుబడులు తిరిగి వచ్చే అవకాశం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టాన్ని తక్షణమే అంచనా వేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి నష్టాన్ని నమోదు చేయాలని రైతులు కోరుతున్నారు. పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని, ఆర్థికంగా ఆదుకోవాలని పలువురు నాయకులు, అన్నదాతలు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యంతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని గ్రామస్థాయి నుండి మండల స్థాయి వరకు ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ధ్వజ స్తంభకి పంచ అమృతలతో పాలాభిషేకం.

**అబ్దుల్లాపూర్ మెట్,అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్):**



రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్టు మండల్ లోని లష్కర్ గూడ గ్రామంలోని ఈరోజు ఉదయం నుండి శ్రీ శ్రీ శ్రీ ప్రసన్నాంజనేయం స్వామి ధ్వజ స్తంభం పున నిర్మాణ మహోత్సవం భాగంగా ధ్వజస్తంభ నికి పంచామృతలుపాలాభిషేకం కార్యక్రమం వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ లస్కర్ గూడ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు శ్రీ ప్రసన్నాంజనేయం స్వామి ధ్వజ స్తంభ కి గ్రామంలోని ప్రతి ఇంటి నుండి మహిళలు భారీ ఎత్తున బిందెలో నీళ్లల్లో తీసుకొని వచ్చి పంచాం అమృతల కలుపుకొని ధ్వజ స్తంభ కి పాలాభిషేకం చేసే కార్యక్రమం చేపట్టడం జరుగుతుంది. కార్యక్రమం ఉంటుంది మూడోరోజు ధ్వజ స్తంభ పున నిర్మాణం కార్యక్రమం అలాగే శివపార్వతుల కళ్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరుగుతుంది కాబట్టి గ్రామ పెద్దలు యువతీ యువకులు మహిళలు భారీ ఎత్తున తరలిరావాలని కోరడం జరుగుతుంది.

# తత్వమసి సేవా సమాజం ఆధ్వర్యంలో మహా పడి పూజా మహోత్సవ పోస్టర్ విడుదల

**జీడిమెట్ల,అక్టోబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తత్వమసి సేవా సమాజం ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలో 18 పడులతో అయ్యప్ప స్వామి మహా పడి పూజా మహోత్సవం డిసెంబర్ 6, 2025 సాయంత్రం 6 గంటలకు జరగనుంది. ఈ పవిత్ర కార్యక్రమానికి సంబంధించి పోస్టర్ విడుదల కార్యక్రమం సుచిత్రలో టీ.ఎన్.ఆర్. నార్త్ సిటీ సినీ పోలీస్ థియేటర్ పక్కన శనివారం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి మాట్లాడుతూ, "ఆధ్యాత్మిక చైతన్యం, భక్తి భావం సమాజంలో మరింత విస్తరించేందుకు ఈ మహోత్సవం వేదిక అవుతుంది. ప్రతి ఒక్కరూ భాగస్వాములై మహోత్సవాన్ని విజయవంతం చేయాలి" అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తత్వమసి సేవా సంఘం సభ్యులు చంద్రం స్వామి, మురళీకృష్ణ స్వామి, జైహింద్ గౌడ్,



నాగరాజు స్వామి, కృష్ణారెడ్డి స్వామి, శ్రీధర్ స్వామి, శివకుమార్ స్వామి, కృపాకర్ రాజు స్వామి పాల్గొన్నారు. అలాగే బీజేపీ 132 జీడిమెట్ల డివిజన్ అధ్యక్షుడు జోగిని రాజు, నాయకులు సిద్దిరాములు, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నార్లకంటి దుర్గయ్య, నార్లకంటి ప్రతాప్, పెద్దింటి సాయిలు, డి. శ్రీనివాస్, అరవింద్, సతీష్, ఎశ్వంత్, పాపయ్య దొర, సందీప్ గౌడ్, వెంకు తదితరులు పాల్గొన్నారు. ఈ మహోత్సవం ద్వారా భక్తి, సేవా భావనలతో కూడిన సామాజిక సమైక్యతకు బలమైన వేదిక ఏర్పడనుందని నిర్వాహకులు తెలిపారు.

# లంబాడీల ఆత్మగౌరవానికి చలో హుస్నాబాద్

## మహా సమ్మేళనానికి వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**హుస్నాబాద్,అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో గిరిజన నాయకులు "లంబాడీల ఆత్మగౌరవానికి చలో హుస్నాబాద్" మహా సమ్మేళనానికి సంబంధించిన వాల్ పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని తిరుమల గార్డెన్‌లో జరగనున్న ఈ మహా సమ్మేళనం, ఎస్టీ జాబితా నుండి లంబాడీలను తొలగించాలని సుప్రీంకోర్టులో కొంతమంది నాయకులు వేసిన పిటీషన్‌కు వ్యతిరేకంగా నిర్వహించబడుతోంది. ఈ సందర్భంగా గిరిజన ఉద్యోగస్తులు, గిరిజన సంఘాల నేతలు మాట్లాడుతూ, "రాజకీయ పార్టీలకతీతంగా ప్రతి గిరిజన తండా నుండి పెద్ద ఎత్తున గిరిజనులు సభకు హాజరై, తమ ఐక్యతను చాటాలి. సుప్రీంకోర్టులో పిటీషన్ వేసిన నాయకులు బేషరతుగా తమ పిటీషన్‌ను వెనక్కి



తీసుకోవాలి. ఎస్టీ జాబితా నుండి లంబాడీలను తొలగించాలనే అంశంపై అన్ని రాజకీయ పార్టీలు తమ వైఖరిని స్పష్టంగా ప్రకటించాలి" అని డిమాండ్ చేశారు. ఈ నెల 8వ తేదీ శుక్రవారం, హుస్నాబాద్‌లోని ఏనె అమరవీరుల స్తూపం నుండి అంబేద్కర్ చౌరస్తా మీదుగా తిరుమల గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ర్యాలీ, సభల ద్వారా గిరిజనులు జాతి ఐక్యతను చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగులు బానోతు కిసన్ నాయక్, లావుడ్య బిక్షపతి, లావుడ్య రవి, గుగులోతు శంకర్ నాయక్, గుగులోతు హరియా నాయక్, భూక్య శ్రీనివాస్ నాయక్, గుగులోతు భీమ సాయబ్, భూక్య సరోజన, గుగులోతు రాజు నాయక్, మాలోత్ రామచందర్ నాయక్, గుగులోతు శివరాజ్ నాయక్, భూక్య వీరన్న నాయక్, ధరావత్ తిరుపతి నాయక్, లకవత్ వెంకటేష్ నాయక్, మూడవ వసంత్ నాయక్, భూక్య మోతిలాల్ నాయక్, లావుడ్య కైలు నాయక్, లావుడ్య భీఖ్య నాయక్, మాలోత్ సత్యం నాయక్, గూగుల్ రవి నాయక్, బానోతు భాస్కర్ నాయక్, గుగులోతు లక్పతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు చోరీపై ఉద్యమం

## 64వ డివిజన్ నుండి సంతకాల సేకరణ ప్రారంభం

**కరీంనగర్,అక్టోబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగరంలోని ఇందిరా చౌక్ వద్ద 64వ డివిజన్ నుండి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించిన సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, దేశవ్యాప్తంగా నమోదవుతున్న దొంగ ఓట్లపై తీవ్రంగా స్పందించారు. "దొంగ ఓట్లతో బీజేపీ దొడ్డి దారిన అధికారంలోకి వస్తోంది. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి" అని ఆయన పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఓటు చోరీపై ఉద్యమం ప్రారంభించామని, ప్రతి డివిజన్ నుండి ప్రజల



అభిప్రాయాలను సంతకాల రూపంలో సేకరిస్తామని నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 17వ తేదీ లోపల అన్ని డివిజన్లలో సంతకాల సేకరణ పూర్తి చేయాలని, డివిజన్ అధ్యక్షులు, ఇంచార్జీలు చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఓటు చాలా విలువైనది. బీజేపీ దాన్ని దుర్వినియోగం చేస్తోంది. కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికైనా కళ్లు తెరవాలి. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయ్యేంతవరకు ఇలాంటి కుట్రలను తిప్పికొడతాం" అని నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బాధ్యుడు పెద్దిగారి తిరుపతి ఆధ్వర్యంలో పి. పద్మ, కోమలత, మనీషా, ఆరిఫ్, వెన్నెల, సోహెల్, శివాని తదితరులు సంతకాలు చేశారు. అలాగే పీసీసీ ప్రధాన కార్యదర్శి రహ్మత్ హుస్సేన్, కొరివి అరుణ్ కుమార్, బోనాల శ్రీనివాస్, అబ్దుల్ రహేమాన్, అహ్మద్ అలీ, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, ఎండి చాంద్, దండి రవీందర్, కుర్ర పోచయ్య, నెల్లి నరేష్, యనమల మంజుల, షబానా మహమ్మద్, ముల్కల కవిత, ఊరడి లత, హసీన, జ్యోతి రెడ్డి, వంగల విద్యా సాగర్, సలీం, సుదర్శన్, నాగుల సతీష్, మాదాసు శ్రీనివాస్, బత్తిని చంద్రయ్య, మహమ్మద్ భారీ, షెహెన్న తదితరులు పాల్గొన్నారు.

# బకింగ్‌హామ్‌షైర్ అయిల్స్‌బరీలో ఘనంగా దసరా బతుకమ్మ సంబరాలు

## తెలుగు సంస్కృతికి విదేశీ వేదికపై నూతన ఒరవడి

**హైదరాబాద్,అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇంగ్లాండ్‌లోని బకింగ్‌హామ్‌షైర్ కౌంటీలోని అయిల్స్‌బరీ పట్టణం ఈసారి అతి పెద్ద భారతీయ సాంస్కృతిక ఉత్సవానికి వేదికగా మారింది. అయిల్స్‌బరీ తెలుగు కమ్యూనిటీ (ఏటీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా మరియు బతుకమ్మ పండుగలు అత్యంత వైభవంగా, సంప్రదాయబద్ధంగా, సమిష్టిగా సాగాయి. ఈ వేడుకల్లో 750 మందికి పైగా తెలుగు ప్రజలు పాల్గొనడం ద్వారా, అయిల్స్‌బరీ పట్టణ చరిత్రలోనే ఇది అతిపెద్ద భారతీయ సాంస్కృతిక సమావేశంగా నిలిచింది. రంగుల బతుకమ్మలు, నృత్యాలు, పాటలు, సంప్రదాయ వేషధారణ, సాంఘిక అనుబంధాలు అన్నీ కలసి తెలుగు సంస్కృతిని విదేశీ





నేలపై ప్రతిబింబించాయి. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఏటీసీ అధ్యక్షురాలు శ్రీమతి బిందు గుండపూడికి, ఏటీసీ నాయకత్వ బృందం తరపున శ్రీ రాజనీష్ రెడ్డి కొర్పోల్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గత రెండు పదవీకాలాల్లో ఆమె చూపిన ఆదర్శనీయ నాయకత్వం, దూరదృష్టి, సమాజ సేవా స్ఫూర్తి ఏటీసీని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లిందని ప్రశంసించారు. అలాగే ఏటీసీ ముఖ్య బృంద సభ్యులు శ్రీ కిశోర్ దమ్మాల, శ్రీ సునీల్ దేవ్, శ్రీమతి సృజన, శ్రీమతి స్పందన, శ్రీమతి సుస్మిత, శ్రీనివాస్ రవికాంత్ తదితరులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకలు సంఘంలో ఐక్యతను బలోపేతం చేయడమే కాకుండా, ప్రతి ఒక్కరికి తమ సాంప్రదాయాల పట్ల గర్వభావాన్ని కలిగించాయి. విదేశీ భూమిలో తెలుగు తేజాన్ని నిలబెట్టే ప్రయత్నానికి ఇది ఒక గొప్ప ఉదాహరణగా నిలిచింది.

# 9 అడుగుల కొండచిలువ కలకలం

## అటవీశాఖ, పోలీసుల అప్రమత్తతతో తప్పిన ప్రమాదం



**ఎల్కతుర్తి,అక్టోబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఎల్కతుర్తి మండలం గుంటూరుపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం అరుదైన ఘటన చోటుచేసుకుంది. ఊరంకి లక్ష్మి ఇంటి వద్ద 9 అడుగుల పొడవైన కొండచిలువను గ్రామస్తులు గుర్తించి తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. వెంటనే ఎల్కతుర్తి పోలీసులకు సమాచారం అందించడంతో, పాములు పట్టే నిపుణుడు శ్రీధర్ సహాయంతో కొండచిలువను సురక్షితంగా పట్టుకున్నారు. ఈ ఘటన నేపథ్యంలో ఎల్కతుర్తి సీఐ రమేష్, ఎస్సై ప్రవీణ్, కానిస్టేబుల్ రాజు, గణేష్ గ్రామస్థులకు సూచనలు చేస్తూ, "వర్షాకాలంలో పాముల సంచారం ఎక్కువగా ఉంటుంది. రైతులు వ్యవసాయ బావులు, పొలాల్లో జాగ్రత్తగా ఉండాలి" అని హెచ్చరించారు. గ్రామస్థుల అప్రమత్తత, పోలీసుల వేగవంతమైన స్పందనతో ప్రమాదం తప్పింది. కొండచిలువను అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో సురక్షిత ప్రాంతానికి తరలించారు.

# ఉమ్మడి జిల్లాల్లో ప్రజావాణి కార్యక్రమం తాత్కాలిక నిలిపివేత

## జిల్లా కలెక్టర్ల ప్రకటన

**కరీంనగర్,అక్టోబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉమ్మడి జిల్లాల్లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఆయా జిల్లా కలెక్టర్లు పత్రికాముఖంగా ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో మోడల్ కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

**రాజన్న సిరిసిల్ల జిల్లా**

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎం. హరిత తెలిపారు. "ఎన్నికల కోడ్ ముగిసేంతవరకు ఈ కార్యక్రమం ఉండదు. అనంతరం యధావిధిగా కొనసాగుతుంది. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలి" అని ఆమె సూచించారు.

**పెద్దపల్లి జిల్లా**

పెద్దపల్లి కలెక్టరేట్‌లో జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రకటించారు. "గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో ఎన్నికల పనుల్లో నిమగ్నమవుతారు. ప్రజలు తమ వినతులను సమర్పించేందుకు కలెక్టరేట్‌కు రావద్దని విజ్ఞప్తి చేస్తున్నాం" అని పేర్కొన్నారు.

**జగిత్యాల జిల్లా**

జగిత్యాల కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేసినట్లు జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ తెలిపారు. "ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమం మళ్లీ యధావిధిగా కొనసాగుతుంది" అని ఆయన స్పష్టం చేశారు.

# స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

## జడ్పీటీసీ ప్రభారీ కన్న కృష్ణ



**కమాన్పూర్,అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా కమాన్పూర్ గ్రామంలోని గణేష్ కన్వెన్షన్‌లో భారతీయ జనతా పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కుంట తిరుపతి ఆధ్వర్యంలో స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశం ఆదివారం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జడ్పీటీసీ ప్రభారీ కన్న కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులదే గెలుపు. ఏ ఎన్నికలు వచ్చినా బీజేపీ అభ్యర్థులదే హవా కొనసాగుతుంది. ఎంపీటీసీ స్థానాల్లో అధిక మెజారిటీతో గెలిచి ఎంపిపి స్థానాన్ని కైవసం చేసుకుంటాం. అలాగే జడ్పీటీసీ స్థానాన్ని కూడా గెలుచుకుంటాం" అని ధీమా వ్యక్తం చేశారు. టికెట్లు ఎవరికి వచ్చినా కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని, పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ నిబద్ధతతో ముందుకు రావాలని సూచించారు. "పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై తగిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు. ఈ సమావేశంలో కడార్ల రతన్, వేముల అనిల్, కోమటిరెడ్డి అంజన్ కుమార్, సోమినేని కర్ణాకర్, కడారి శ్రీనివాస్, పూర్తి అనిల్, నలువాల మహేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ గ్రామాల బూత్ కమిటీ అధ్యక్షులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఆశావహులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# యువకుడిపై దాడి చేసిన రౌడీషీటర్ అరెస్ట్



**జగిత్యాల,అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జగిత్యాల పట్టణంలోని విద్యానగర్ ప్రాంతంలో ఈ నెల 3న చోటుచేసుకున్న దాడి ఘటన కలకలం రేపింది. విద్యానగర్ రామాలయం సమీపంలో కాసెట్టి శ్రీధర్ అనే యువకుడిపై రౌడీషీటర్ జువ్వాడి దీక్షిత్ దాడి చేసి గాయపరిచిన ఘటనపై పోలీసులు స్పందించారు.బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్ఐ సుప్రియ కేసు నమోదు చేసి, ఆదివారం నాడు టౌన్ సీఐ కరుణాకర్ నేతృత్వంలో దీక్షిత్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. స్థానికంగా ఈ ఘటనపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.పోలీసులు వర్షాకాలంలో శాంతి భద్రతల పరిరక్షణకు మరింత అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు ఏవైనా అనుమానాస్పద వ్యక్తులను గమనిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు ముమ్మర ఏర్పాట్లు




**బెల్లంపల్లి,అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బెల్లంపల్లి నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిస్థాయిలో కొనసాగుతున్నాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శనివారం ఆయన డీసీపీ భాస్కర్ తో కలిసి బెల్లంపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, బ్రాంచి ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "నామినేషన్ ప్రక్రియ ప్రారంభం నుండి ఫలితాలు వెలువడే వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్) పూర్తిగా అమల్లో ఉంటుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు, అభ్యర్థులు అందరూ నియమావళిని గౌరవించాలి" అని సూచించారు.ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, న్యాయబద్ధత, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. బెల్లంపల్లి ప్రజలు ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొని ప్రజాస్వామ్యాన్ని బలపరచాలని ఆయన ఆకాంక్షించారు.


# శంభీపూర్ కృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మహేందర్ యాదవ్



**దుండిగల్,అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని కార్యాలయంలో ఆదివారం బీఆర్ఎస్ నేత శంభీపూర్ కృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు బండారు మహేందర్ యాదవ్ శాలువాతో సన్మానించి, కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అభిమానులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు తదితరులు పాల్గొని శంభీపూర్ కృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్నేహపూర్వక వాతావరణంలో సాగిన ఈ వేడుకలో, కృష్ణ సేవా కార్యక్రమాలను ప్రశంసిస్తూ, ఆయనకు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షలు వ్యక్తమయ్యాయి.

# అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి దర్శించిన ఉప్పల కుటుంబం





**హైదరాబాద్,అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి చెందిన రత్నగిరి కొండపై, పంపా నది ఒడ్డున వెలసిన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి ఆలయాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఆర్య వైశ్య భవనం చైర్మన్ గాంధీ సమక్షంలో స్వామివారి దర్శనం అనంతరం వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి వ్రతాలు నిర్వహిస్తూ భక్తిశ్రద్ధలతో దర్శనం చేసుకుంటున్నారని ఉప్పల శ్రీనివాస్ గుప్త పేర్కొన్నారు.ఈ పుణ్యక్షేత్ర దర్శనంలో ఉప్పల శ్రీనివాస్ గుప్త, సతీమణి ఉప్పల స్వప్న, కుమారుడు ఉప్పల సాయి తేజ, కోడలు శార్వరీ కలిసి సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, పెద్ద కుమారుడు ఉప్పల సాయి కిరణ్ గుప్త, కోడలు శార్వరీ, చిన్న కుమారుడు ఉప్పల సాయి తేజ, పబ్బ శేఖర్, కట్ట రవి, నరేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# బహుజనుల ఐక్యతే బీఎస్పీ విజయానికి మార్గం

## పుల్లూరు ఉమేష్



**హుస్నాబాద్,అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ పట్టణంలోని బీఎస్పీ పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు పుల్లూరు ఉమేష్ మాట్లాడుతూ, "సిద్దిపేట జిల్లాలో రేపు జరగబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో బహుజనుల ఐక్యతతో అధిక సీట్లు గెలవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం" అని తెలిపారు. జిల్లాలోని 26 జెడ్పీటీసీ స్థానాలను గెలుచుకునేలా వ్యూహాత్మక ప్రణాళికలు రూపొందించామని చెప్పారు.తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు పూర్తి సహకారం అందిస్తున్న ఏకైక పార్టీ బీఎస్పీ అని, మిగతా పార్టీలకు బీసీల పట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు. "బీసీ బిల్లు పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ ప్రజలు, బీసీ సామాజిక వర్గం ఈ కుట్రలను గమనిస్తున్నారు" అని ఉమేష్ పేర్కొన్నారు.అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, అగ్రవర్ణ పేదల హక్కుల కోసం బీఎస్పీ పార్టీ మాత్రమే నిజంగా పనిచేస్తుందని, వచ్చే ఎన్నికల్లో బీఎస్పీని ఆదరించి అధిక సీట్లలో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి దేగల వెంకటేష్, హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్, అధ్యక్షులు వెలుపుల రాజు, నాయకులు బోయని బాబు, మారేపల్లి సుధాకర్, హనుమంతు, రాంబాబు, భూసమల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యంగా బీజేపీ వ్యూహ సమావేశం



**ఆమనగల్,అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా ఆమనగల్ బీజేపీ పార్టీ కార్యాలయంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి గారి అధ్యక్షతన, ఆమనగల్ (రూరల్), కడ్తాల్, మాడుగుల, తలకొండపల్లి నాలుగు మండలాల పదాధికారుల సమన్వయ సమావేశం ఆదివారం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ జడ్పీటీసీ కండె హరిప్రసాద్ పాల్గొన్నారు. మండల అధ్యక్షులు ఎర్రవోలు శ్రీనివాస్ ముదిరాజ్ (ఆమనగల్), నల్ల కాసుల పెద్దయ్య యాదవ్ (మాడుగుల), ధోనాదుల మహేష్ (కడ్తాల్), తిరుమణి రవి గౌడ్ (తలకొండపల్లి) సహా రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.సమావేశంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి అవసరమైన వ్యూహరచన, బలోపేత కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కార మార్గాలు వంటి అంశాలపై విశ్లేషణాత్మక చర్చ జరిగింది. గ్రామ, మండల స్థాయిలో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించి, బీజేపీని కల్వకుర్తి నియోజకవర్గంలో మరింత బలంగా నిలపాలని తీర్మానం తీసుకున్నారు.అభ్యర్థుల ఎంపిక, పార్టీ కార్యాచరణ, ప్రచార వ్యూహాలపై స్పష్టమైన దిశానిర్దేశం చేయడంతో పాటు, గెలుపే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతుందని నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

# గీత కార్మికుల హక్కుల కోసం ప్రభుత్వాన్ని నిలదీయాలి

## మేకపోతుల వెంకటరమణ



**కరీంనగర్,అక్టోబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ సీఐటీయూ కార్యాలయంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు వెంకట నరసయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ, గీత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని, ఎక్స్‌గ్రేషియా, పెన్షన్, రక్షణ కవచాల పంపిణీ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. "చెవిటివారి ముందు శంఖం ఊదినట్లే ఉంది" అని వ్యాఖ్యానించారు.వృత్తి ప్రమాదకరమైనదిగా పేర్కొంటూ, తక్షణమే అన్ని హక్కులు కల్పించాలని, కల్లు -నీరా ఉత్పత్తులను ప్రోత్సహించాలని, తాటి చెట్ల పెంపకానికి భూములు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గీత కార్మికుల సంక్షేమంపై దృష్టి పెట్టాలని కోరారు.ఈ సమావేశంలో సురుగు రాజేష్, గర్వందుల రమేష్, బుర్ర శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పాంగోలిన్ స్కేల్స్ అక్రమ రవాణా ముఠా గుట్టురట్టు

## నలుగురు అరెస్ట్




**హనుమకొండ,అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హనుమకొండలో పాంగోలిన్ (అలుగు) పొలుసుల అక్రమ రవాణా చేస్తున్న ముఠాను హైదరాబాద్ యూనిట్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు ఆదివారం సోదాల ద్వారా గుట్టుచప్పుడు కాకుండా పట్టుకున్నారు. ఈ దాడుల్లో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 6.53 కిలోల పాంగోలిన్ స్కేల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.అలుగుల్ని వేటాడి, వారి చర్మంపై ఉండే పొలుసులను వేరు చేసి, ఔషధ తయారీకి వినియోగించే ఉద్దేశంతో ఆగ్నేయాసియా దేశాలకు అక్రమంగా ఎగుమతి చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. పాంగోలిన్ స్కేల్స్‌కు అంతర్జాతీయంగా భారీ డిమాండ్ ఉండటంతో ఈ ముఠా ఈ అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.వైల్డ్ లైఫ్ చట్టం ప్రకారం అలుగుల వేట నేరమని, ఇటువంటి చర్యలు పర్యావరణానికి హానికరమని పోలీసులు హెచ్చరించారు. అరెస్ట్ చేసిన నిందితులను హనుమకొండ అటవీశాఖ అధికారులకు అప్పగించినట్లు సమాచారం.

# రైతు బిడ్డ ఘనత

## గ్రూప్-1లో 54వ ర్యాంకుతో డీఎస్పీగా ఎంపిక



**సిరిసిల్ల,అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా కందికట్కూర్ గ్రామానికి చెందిన బత్తుల శివ కుమార్, ఒక సాధారణ రైతు కుటుంబానికి చెందిన యువకుడు, తెలంగాణ రాష్ట్ర గ్రూప్-1 పరీక్షల్లో 54వ ర్యాంకు సాధించి డీఎస్పీగా ఎంపికయ్యాడు. వ్యవసాయ నేపథ్యం నుండి వచ్చిన శివ కుమార్ ఈ ఘనత సాధించడం పట్ల గ్రామస్థులు, బంధువులు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.అతని తండ్రి బత్తుల రవీందర్ రైతు, తల్లి కరుణ గృహిణి. కష్టాలను అధిగమించి, పట్టుదలతో చదువుకొని, శ్రమ ఫలితంగా శివ కుమార్ ఈ స్థాయికి చేరుకున్నాడు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్న శివ కుమార్, తన విజయాన్ని తల్లిదండ్రులకు, గురువులకు, గ్రామ ప్రజలకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు.గ్రామంలో శివ కుమార్ ఎంపిక వార్త వినగానే హర్షాతిరేకం నెలకొంది. యువతకు ఆదర్శంగా నిలిచేలా, గ్రామానికి గర్వకారణంగా మారిన శివ కుమార్‌ను పలువురు అభినందించారు.

# దేవక్కపల్లి స్టేజిలో ఎన్నికల చెక్ పోస్టును పరిశీలించిన జిల్లా కలెక్టర్



**బెజ్జంకి,అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల పరిధిలోని దేవక్కపల్లి స్టేజి వద్ద రాజీవ్ రహదారిపై ఏర్పాటు చేసిన ఎస్ఎస్టీ ఎన్నికల చెక్ పోస్టును జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చెక్ పోస్టు వద్ద ఉన్న రిజిస్టర్‌ను పరిశీలించి, తన సంతకం చేశారు.స్టేట్ ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం, 24 గంటల పాటు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఎన్నికల సమయంలో అక్రమ రవాణా, నగదు, మద్యం, ఇతర ప్రభావిత వస్తువుల నియంత్రణకు చెక్ పోస్టులు కీలకమని ఆమె పేర్కొన్నారు.తనిఖీ ప్రక్రియను పూర్తిగా వీడియోలో రికార్డ్ చేయాలని, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# ములుగు -భద్రాచలం రహదారి దుస్థితిపై ప్రజల ఆవేదన

## రవాణా సౌకర్యాల పునరుద్ధరణకు డిమాండ్



**వెంకటాపురం,అక్టోబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రం నుండి భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారి గుంతలతో నిండిపోయి పూర్తిగా అధ్వానంగా మారింది. గత మూడు నెలలుగా ఈ మార్గంలో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయిన నేపథ్యంలో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిమితికి మించిన భారంతో నడుస్తున్న ఇసుక లారీలు రహదారి పరిస్థితిని మరింత దారుణంగా మార్చాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా జరుగుతుండటంతో రహదారి పూర్తిగా దెబ్బతిన్నదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "భద్రాచలం వెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు లేక, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంత్రి సీతక్క, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు ఎన్నిసార్లు చెప్పినా స్పందించలేదు" అంటూ స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వం తక్షణమే రహదారి మరమ్మతులు చేపట్టి, రవాణా సౌకర్యాన్ని పునరుద్ధరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రహదారి పునరుద్ధరణతో పాటు, ఇసుక లారీలపై నియంత్రణ విధించాలని, ప్రజల ప్రయాణ హక్కులను కాపాడాలని కోరుతున్నారు.

# ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి





## టీఎండీసీ ఎండీ భావేష్ మిశ్రా

**కరీంనగర్,అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లాలోని ఇసుక లోడింగ్ కేంద్రాల్లో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రజా అవసరాల కోసం మాత్రమే ఇసుక రవాణా జరగాలని తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎండీసీ) మేనేజింగ్ డైరెక్టర్ భావేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన పీవో వినయ్‌తో కలిసి కరీంనగర్ జిల్లాలోని కొండపాక, బ్లాక్-1, బ్లాక్-2 ఇసుక క్వారీలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా క్వారీల్లో జరుగుతున్న ఇసుక లోడింగ్ ప్రక్రియను, నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. రవాణాకు సంబంధించిన పత్రాలు, డిజిటల్ ట్రాకింగ్ విధానాన్ని తనిఖీ చేశారు.

**అక్రమాలకు అడ్డుకట్ట**

సిబ్బంది ప్రతి నిత్యం లోడింగ్, రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని, అనధికారిక రవాణాను ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకోవాలని సూచించారు. పారదర్శకత పెంచేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన చోట్ల బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

**భద్రతా ప్రమాణాలు, పర్యావరణ పరిరక్షణ**

లోడింగ్ సమయంలో పాటించాల్సిన భద్రతా ప్రమాణాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. క్వారీల చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు ఇసుక రవాణా వల్ల ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పర్యావరణ నిబంధనలకు లోబడి క్వారీ నిర్వహణ జరగాలని ఆదేశించారు.

ఈ తనిఖీలో టీఎండీసీ ఎండీ భావేష్ మిశ్రా, పీవో వినయ్‌తో పాటు మైనింగ్ శాఖకు చెందిన ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా గడ్డం వెంకటస్వామి జయంతి




**కరీంనగర్,అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ కేంద్రమంత్రి, దివంగత నేత గడ్డం వెంకటస్వామి (కాక) గారి జయంతి కార్యక్రమాలు ఆదివారం ఘనంగా నిర్వహించబడ్డాయి. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రహమత్ హుస్సేన్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్న రాజ మల్లయ్య, డీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్, డీసీసీ బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కొరివి అరుణ్ కుమార్ మాట్లాడుతూ, వెంకటస్వామి గారు పేదల పక్షపాతిగా, కార్మికుల హక్కుల కోసం పోరాడిన మహానీయుడిగా, హైదరాబాద్ నగరంలో నిరుపేదలకు గుడిసెలు నిర్మించి "గుడిసెల వెంకటస్వామి"గా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. రాష్ట్ర, కేంద్ర మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా పలు పదవులు నిర్వహించిన ఆయన, ప్రతినిత్యం పేదల కోసం పరితపించిన ప్రజానాయకుడని, ఆయన ఆశయ సాధన కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాడే శంకర్, వంగల విద్యాసాగర్, నాగుల సతీష్, కుంభాల రాజ్ కుమార్, గంగుల దిలీప్, పర్వత మల్లేశం, మాదాసు శ్రీనివాస్, చాంద్ పాషా, సిరికొండ శివప్రసాద్, యనమల మంజుల, కాంపల్లి కీర్తి కుమార్, నర్సింగం, తోట రవి, మామిడి సత్యనారాయణ రెడ్డి, లక్ష్మణ్ ముదిరాజ్, సుంకరి గణపతి, వీర దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సైదాపూర్‌లో వరద బీభత్సం

## నీటమునిగినలోతట్టు ప్రాంతాలు





**సైదాపూర్,అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ నియోజకవర్గంలోని సైదాపూర్ మండలంలో ఈరోజు మధ్యాహ్నం కురిసిన భారీ వర్షం తీవ్ర ప్రభావం చూపింది. వర్షం కారణంగా పాత బస్టాండ్ పరిసరాల్లోని 5, 6, 10 వార్డుల్లోని లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీటమునిగాయి. వరదనీరు ఇళ్లలోకి ప్రవేశించడంతో నిత్యావసర వస్తువులు పాడయ్యాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మురుగు కాలువలు శిథిలావస్థలో ఉండటంతో రహదారులపై వరదనీరు నిలిచిపోయింది. వాహనదారులు రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు బయటకు రావడానికే భయపడే పరిస్థితి నెలకొంది. వరద నీటితో రహదారులు చెరువుల్లా మారిపోయాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి వరద బాధితులకు సహాయం అందించాలని, శాశ్వత పరిష్కారంగా మురుగు కాలువలను పునర్నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రతి వర్షానికి ఇలాగే ఇళ్లలోకి నీరు ప్రవేశిస్తోందని, ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ జిల్లాలో పథ సంచాలన్, విజయదశమి వేడుకలు





**కరీంనగర్,అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పథ సంచాలన్ కార్యక్రమాలు, విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. తిమ్మాపూర్ రామకృష్ణ కాలనీలో, చింతకుంట గ్రామంలో, కరీంనగర్ నగరంలో స్వయంసేవకులు భారీగా పాల్గొని కవాతు నిర్వహించారు. తిమ్మాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో విభాగ్ ప్రచారక్ భానుచందర్ జి మాట్లాడుతూ, ఆర్‌ఎస్‌ఎస్ 1925లో డాక్టర్ హెడ్గేవార్ స్థాపించిన సంస్థగా, వందేళ్లుగా దేశ, సమాజ సేవకు అంకితమై పనిచేస్తోందన్నారు. "ప్రతి హిందువు కుటుంబ విలువల పరిరక్షణకు నడుం బిగించాలి" అని పిలుపునిచ్చారు. దేశం అభివృద్ధి సాధించి ప్రపంచంలో అగ్రగామిగా నిలవాలన్నదే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని తెలిపారు. చింతకుంట గ్రామ రైతు వేదికలో జరిగిన విజయదశమి వేడుకల్లో మంచికట్ల సూర్యభాను మాట్లాడుతూ, వ్యక్తిత్వ నిర్మాణానికి కుటుంబమే ఆధారం అని, ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగబద్ధంగా దేశాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. పంచ పరివర్తన లక్ష్యంగా ు సామాజిక సమరసత, కుటుంబ జీవన విలువలు, స్వాధారిత జీవనం, పర్యావరణ పరిరక్షణ, పౌర విధులు ప్రతి ఇంటికి చేరేలా జనజాగరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కరీంనగర్ నగరంలో టిటిడి కళ్యాణమండపం వరకు సాగిన పథ సంచాలన్ అనంతరం జరిగిన సమావేశంలో తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేష్ జి మాట్లాడుతూ, ఆర్‌ఎస్‌ఎస్ దేశాన్ని మాతృభూమిగా భావించే ప్రజల ప్రయోజనాల కోసం పనిచేస్తోందని, వ్యక్తి వికాసం ద్వారా సమాజ నిర్మాణం, దేశాభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. "ఆర్‌ఎస్‌ఎస్ ఒక పవర్ హౌస్ లాంటిది, దేశానికి అవసరమైన శక్తిని అందించే కేంద్రం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో భానుచందర్ జి, శ్రీధర్ జి, బాలరాజ్ జి, రాజశేఖర్ జి, వినీత్ జి, సంపత్ జి, రామారావు, కుమార్ జి, భూమిరెడ్డి, నర్సింగరావు, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న సేవలో ఎస్పీ మహేష్ బి. గీతే



**వేములవాడ,అక్టోబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే ఆదివారం దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనం అనంతరం అర్చకులు ఆయనకు అద్దాల మండపంలో ఆశీర్వాదం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. సెలవు దినం కావడంతో ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చి సందడిగా మారింది. ధర్మదర్శనంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

# మాజీ జెడ్పీటీసీ బక్కారెడ్డి పార్థివ దేహానికి బీజేపీ నేతల నివాళులు



**హుజురాబాద్,అక్టోబర్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుజురాబాద్ మండలం కందుగుల గ్రామానికి చెందిన తాజా మాజీ జెడ్పీటీసీ పడిదం బక్కారెడ్డి పార్థివ దేహానికి కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి బాధను పంచుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు రాముల కుమార్, సీనియర్ నాయకులు రావుల భాస్కర్ రెడ్డి, కేసిరెడ్డి విజేందర్ రెడ్డి, తూర్పాటి రాజు, కొండలు రెడ్డి, ముప్పు మహేష్, చీదురాల శ్రీనివాసరెడ్డి, పొన్నం చందర్ రెడ్డి తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.